# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 155 | హైదరాబాద్ | సోమవారం 08-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

నమ్మించి మోసం చేశారు...
సోషల్ మీడియాలో భక్తుడి పోస్ట్


11లో

## డిసెంబరు 9న విజయ్ దివస్..

రాష్ట్రవ్యాప్త సంబరాలకు పిలుపునిచ్చిన కేటీఆర్

## నిన్నటి వరకు ఒక లెక్క.. గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క

- కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సందేశం
- హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం
- యువతకు కొలువులు, రైతులకు దన్ను, మహిళలకు భరోసా ఇచ్చామన్న ముఖ్యమంత్రి
- తెలంగాణను దేశ గ్రోత్ ఇంజన్‌గా మార్చడమే లక్ష్యమని స్పష్టీకరణ
- గ్లోబల్ సమ్మిట్ తర్వాత తెలంగాణలో కొత్త లెక్క మొదలవుతుందని వ్యాఖ్య


11లో

## గోవా అగ్నిప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని విచారం

ఎక్స్‌గ్రేషియా ప్రకటన


11లో


11లో

కేసీఆర్ పోయి
## రేవంత్ వచ్చారంతే..

అందులో మాత్రం మార్పేమీ లేదు : కిషన్ రెడ్డి

- ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనన్న కిషన్ రెడ్డి
- హామీల అమలుపై చర్చకు రావాలంటూ సీఎం రేవంత్‌కు సవాల్

## గోవా నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం

### 25 మంది మృతి

11లో

- సిలిండర్ పేలడంతో దుర్ఘటన
- మృతుల్లో నలుగురు పర్యాటకులు, మిగతావారు క్లబ్ సిబ్బంది
- ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించిన సీఎం
- భద్రతా లోపాలే కారణమని అనుమానం



## ఆ 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మారాలి..


11లో

- ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష నిర్వహించిన చంద్రబాబు
- జగన్ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న సీఎం
- ఆర్ఎస్ఎస్ తరహాలో క్యాడర్‌ను సిద్ధం చేసుకోవాలని పిలుపు
- విద్యార్థుల కోసం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం


11లో

హైదరాబాదులో అమెరికా కాన్సులేట్ రోడ్డుకు
## డొనాల్డ్ ట్రంప్ పేరు

- గ్లోబల్ సమ్మిట్ వేళ కీలక నిర్ణయాలు
- హైదరాబాద్‌లో ట్రంప్, గూగుల్ పేర్లతో వీధులు
- విప్రో, మైక్రోసాఫ్ట్ పేర్లపైనా భవిష్యత్తులో పరిశీలన
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ప్రభుత్వ ప్రకటన

# రష్యాతో భారత్ స్ట్రాంగ్ బంధం

ఎట్టకేలకు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ కు వచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలం విమానాశ్రయంలో ఆయనకు ఎదురేగి స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో రష్యా .. భరాత్ పర్యటన వెనక అసలు ఉద్దేశ్యం అదేనా..భారత్ లో రష్యా అధ్యక్షుడి పర్యటన అజెండా ఏంటి? ఎలాంటి ఒప్పందాలు చేసుకోబోతున్నారు? ఇరుదేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి? ఆసక్తికరంగా మారాయి. ప్రపంచ ముఖచిత్రంలో విప్లవాత్మక మార్పు? భారత్ శక్తి సామర్థ్యాలు నానాటికీ బలోపేతమవుతున్నాయి. పొరుగు దేశాలతో సన్నిహిత సంబంధాలు అద్భుతాన్ని ఆవిష్కరిస్తున్నాయి. తాజాగా రష్యాతో భారత్ సంబంధాలు మరింతగా బలోపేతం కాబోతున్నాయి. భారతదేశానికి అన్నిరకాలుగా సంపూర్ణ సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భరోసా ఇచ్చారు. ఆయనే స్వయంగా భారత్ లో పర్యటిస్తున్నారు. పుతిన్ రెండు రోజుల పర్యటన ఆత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. సవాళ్లను ఎదుర్కొని సమర్థవంతంగా రాణిస్తున్న భారత్ శత్రు దేశాలపట్ల సింహస్వప్నం కాబోతోంది. శత్రు మూకలను తుద ముట్టించేందుకు.. ఉగ్రవాదాన్ని కనుమరుగు చేసేందుకు?సుదర్శన చక్రం భారత్ కు దివ్యాస్త్రం కాబోతోంది. భారత్ వినాశనానికి ప్రయత్నించేవాళ్లను భూస్థాపితం చేయాలి. పగతో పొరుగు దేశస్తులు కుట్రచేస్తే అదే వాళ్లకు ఆఖరి రోజుకావాలి. శతృవుల కళ్లకు వాళ్ల చావు వాళ్లకే కనబడాలి ఉగ్రవాదంతో ఊగిపోయే దుర్మార్గులను కనుమరుగు చేయాలి.. ఇదీ భారత్ లక్ష్యం. దీనికి ప్రపంచంలోనే అంత్యంత శక్తివంతమైన రక్షణ క్షిపణులు అందించేందుకు రష్యా ముందుకొచ్చింది.ప్రపంచంలో వివిధ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ.. భారత్ – రష్యా బంధాలు ప్రత్యేకం అని చెప్పాలి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని అమెరికా ఆంక్షలు విధించి ఆర్థికంగా ఇబ్బందిపెట్టినా.. రష్యాతో అనుబంధాన్ని విడదీయరానిది. భారత్ పట్ల రష్యాకున్న సన్నిహిత సంబంధంతో కీలక భాగస్వామ్యాలతో ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల భారత పర్యటనకు విచ్చేసారు. డిసెంబరు 4, 5 తేదీల్లో పుతిన్ పర్యటన ప్రత్యేకతను సంతరించుకుంది. రష్యన్ సైన్యం ఉక్రెయిన్‌ను ఆక్రమించడానికి కొన్ని నెలల ముందు, డిసెంబర్ 2021లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారతదేశాన్ని సందర్శించారు. ఎన్నో సవాళు .. అగ్రరాజ్యం అమెరికా హెచ్చరికల నేపథ్యంలో తాజాగా పుతిన్ భారత్ ను సందర్శించారు. తాజా పర్యటనలో 23వ వార్షిక భారత్–రష్యా శిఖరాగ్ర సమావేశంలో పుతిన్ పాల్గొనబోతున్నారు. ఈ సందర్భంగా సౌత్ బ్లాక్‌లో రష్యా అధ్యక్షుడికి రెడ్ కార్పెట్ స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ.. రష్యాపర్యటనకు వెళ్లిన సమయంలో పుతిన్ ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతంతో రష్యా సైనిక బలగాలు గౌరవించాయి. ఇపుడు భారత్ కు వచ్చిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సంప్రదాయ నృత్యరీతులతో స్వాగతం పలికారు మోడీ. స్వయంగా పాలెం విమానాశ్రయంలో పుతిన్ ను స్వాగతం పలకడమే కాకుండా.. ఆత్మీయ ఆలిగంగనం చేశారు. అంతేకాదు పుతిన్ తన వెంట తెచ్చుకున్న కారులో కాకుండా మోడీ కారులో ఎక్కడం విశేషం. అపుడు పుతిన్ ఆతిథ్యానికి ఫిదా అయిన ప్రధాని నరేంద్రమోడీ.. తన అధికారిక నివాసం లోక్ కళ్యాణ్ మార్గ్ లో ఇపుడు ప్రత్యేకంగా ఆతిథ్య మిచ్చారు. భారత్, రష్యాల మధ్య స్నేహం నేటికీ బలంగా ఉంది. ప్రధాని మోదీ ప్రభుత్వం వచ్చాక ఇది మరిం బలపడిందనే చెప్పాలి. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచీ పుతిన్ తో మం? సంబంధాలను కలిగి ఉన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ మొదటిసారి రష్యా వెళ్లారు ఆ సమయంలోనే పుతిన్ ఆయనకు అత్యంత గౌరవాన్ని ఇవ్వడమే కాకుండా ప్రత్యేకంగా కూడా చూసుకున్నారు. ఇరు దేశాధినేతలూ ఇప్పటికీ తమ మధ్య ఉన్న అనుబంధాన్ని అదే విధంగా మెయింటెయిన్ చేయడం గమనార్హం. వారిద్దరి మధ్యా బలమైన స్నేహానికి నిదర్శనమేరెండో రోజు పర్యటనలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చే ఆత్మీయ విందును స్వీకరించారు.ప్రపంచ దేశాల్లో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ భారతదేశం–రష్యా మధ్య కొనసాగుతున్న దౌత్య సంబంధాలకు పుతిన్ పర్యటన ప్రతీకగా నిలవబోతోంది. రక్షణ సహకారం, వాణిజ్య ఒప్పందాలు, పౌర అణు భాగస్వామ్య అంశాలు కీలక అజెండాలో ఉన్నాయి. ఇరుదేశాల అధినేతలు పరస్పరం కీలక అంశాలపై చర్చించుకుని సముచిత నిర్ణయాలు తీసుకున్నారు. దేశ ప్రయోజనాలే లక్ష్యంగా ఒప్పందాలు చేసుకోబోతున్నారు. ఇంధనం, పరిశ్రమ, అంతరిక్షం, వ్యవసాయం, ఇతర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా ఇరుదేశాలు చర్యలు తీసుకోబోతున్నాయి. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశం పైనా ప్రధాని నరేంద్ర మోడీతో పుతిన్ చర్చలు జరిపారు రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకునే చమురు పరిమాణం తాత్కాలికంగా తగ్గినప్పటికీ మాస్కో ఆ దేశానికి కీలక ఇంధన సరఫరాదారుగా కొనసాగించే విధంగా 25 ఒప్పందాలు చేసుకున్నారు.భారత్ – రష్యా దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చల ఎజెండాలో ఎస్–400, ఎస్‌యు–57 స్టెల్త్ యుద్ధ విమానాల డీల్స్ తప్పకుండా ఉంటాయని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ స్పష్టం చేశారు. ఎస్‌యు–57 యుద్ధ విమానం ప్రపంచంలోనే అత్యుత్తమమైనది. ఇది అతిశయోక్తి కాదు. పుతిన్ భారత పర్యటనలో ఈ అంశం కూడా ఎజెండాలో ప్రాధాన్యత ఇచ్చారు. భారత్–రష్యా సంబంధాలపై అమెరికా ప్రభావం ఉండకూడదన్న అర్థం వచ్చేలా.. ద్వైపాక్షిక సంబంధాలపై బయటి ఒత్తిళ్ల జోక్యం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.ఇరు దేశాల మధ్య రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు బలోపేతం కానున్నాయి. భారతీయ సాంకేతికత, మ్యాన్ పవర్ ను రష్యా వినియోగించుకునే అంశాలపై చర్చ జరగబోతోంది. భారతీయ నిపుణులు, సెమీస్కిల్డ్ నిపుణులను రష్యా విరివిగా వినియోగించుకోబోతోంది. నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ , ఆతిథ్య రంగాలలో పనిచేయడానికి వీలు కల్పించే లేబర్ మొబిలిటీ ఒప్పందంపై కూడా ఇరుపక్షాలు ఒప్పందం చేసుకున్నాయి.. 1962 తర్వాత భారత్ కు సోవియట్ యూనియన్ స్నేహ హస్తాన్ని చాచింది. ఆసియాలో తమ పట్టును పెంచుకునేందుకు దోహదపడింది. మొట్టమొదటగా 1960ల ప్రారంభంలో సోవియట్ యూనియన్ భారత్ కు మిగ్ 21 యుద్ధ విమానాలను అందించింది. ఇవే అప్పట్లో అత్యంత అధునాతన ఫైటర్ జెట్ లు. ఇది అప్పట్లో ఒక గేమ్ ఛేంజర్ గా నిరూపించబడింది. దీంతో పాటూ రష్యా తన యుద్ధ సాంకేతికతను కూడా బదిలీ చేసింది. ఇది భారత్ స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు దోహదపడింది. ఇలా ప్రతీసారి రష్యా, భారత కు అండగా నిలబడింది. అలాగే ఇండియా కడా సోవియట్ యూనియన్ స్నేహాన్ని ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ వచ్చింది. 1971లో భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఒకవైపు బంగ్లాదేశ్ స్వతంత్ర యుద్ధం జరుగుతోంది. ఆ సమయంలో, అమెరికా దాని మిత్రదేశాలు పాకిస్తాన్‌కు బహిరంగంగా మద్దతు ఇస్తున్నాయి. వాటి నౌకాదళం భారతదేశాన్ని బెదిరించడానికి బంగాళాఖాతం వైపు కదులుతోంది.ఒక రకమైన ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఆ సమయంలో రష్యా భారత్ కు అండగా నిలబడింది. భారీ రాజకీయ రిస్క్ తీసుకుని మరీ తన యుద్ధ నౌకలను భారత సరిహద్దుల్లో మోహరించింది. దీంతో అమెరికా నౌకాదళం వెనక్కు తగ్గాల్సి వచ్చింది.

# 2029 ఎన్నికల కోసం వ్యూహరచనలు

కడపడిసెంబర్ 07 (భారత శక్తి)

జగన్మోహన్ రెడ్డి రాజకీయ వ్యూహాలను రూపొందిస్తున్నారు. అది కూడా ఇక్కడ కాదు. పక్క రాష్ట్రంలో ఉండి 2029 ఎన్నికల్లో ఎలా గెలుపొందాలి అనే దానిపై వ్యూహరచన చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగళూరులోనే గడుపుతున్నారు. వారంలో మూడు రోజులపాటు తాడేపల్లికి వస్తున్నారు. మధ్యలో విదేశీ పర్యటనలతో పాటు విపత్తులు సమయంలో మాత్రం తాడేపల్లి ముఖం చూడడం లేదు. కానీ ఇటీవల మాత్రం తాడేపల్లి వస్తున్న క్రమంలో పార్టీ శ్రేణులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బెంగళూరు బయలుదేరే వెళ్లే ముందు ప్రెస్ మీట్ పెడుతున్నారు. అందులో వారాంతపు అంశాలపై ప్రభుత్వ వైఫల్యాలను గుర్తు చేస్తూ మాట్లాడుతున్నారు. అయితే ప్రభుత్వ వైఫల్యాలు కంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై విమర్శలకి ఎక్కువగా పరిమితం అవుతున్నారు. లోకేష్ ను ప్రమోట్ చేస్తున్నారు అంటూ కొన్ని రకాల విమర్శలు అయితే చేస్తున్నారు. కానీ బెంగళూరులోనే ఎక్కువగా గడుపుతుండడం పై సొంత పార్టీ శ్రేణుల్లో కూడా విస్మయం వ్యక్తం అవుతుంది.పార్ట్ టైం నేతలు అంటూ చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ పై ఆరోపణలు చేసేవారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు ఆయన చేస్తోంది కూడా అదే. 2019 నుంచి 2024 మధ్య చంద్రబాబు తో పాటు పవన్ ఎక్కువగా హైదరాబాదు నుంచి వచ్చేవారు. దానిని గుర్తు చేస్తూ పార్ట్ టైం లీడర్స్ అంటూ వ్యాఖ్యానించేవారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అదే జగన్మోహన్ రెడ్డి బెంగళూరులోని ఎలహంక ప్యాలెస్ విడిచి పెట్టడం లేదు. అయితే అక్కడ ఏం చేస్తున్నారన్నది ప్రశ్న. ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లు ఆ మధ్యలో ప్రచారం సాగింది. ఎందుకంటే అక్కడ డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు కూడా. అందుకే అప్పట్లో అలా ప్రచారం సాగింది. అయితే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏమంత బాగాలేదు. అందుకే జగన్మోహన్ రెడ్డి డీకే శివకుమార్ ద్వారా చేసిన ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. అందుకే ఇప్పుడు సొంత అజెండాతో ముందుకు వెళుతున్నట్లు సమాచారం.బెంగళూరు యలహంక ప్యాలెస్ కునేషనల్ మీడియా ప్రతినిధులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు పేరు మోసిన మీడియా ఛానల్ ప్రతినిధులు ఎక్కువగా వస్తున్నట్లు బెంగళూరు వర్గాల్లో ప్రచారం సాగుతోంది. 2019 నుంచి 2024 మధ్య ఎక్కువగా జగన్మోహన్ రెడ్డి నేషనల్ మీడియాతోనే టచ్ లో ఉండేవారు. ఓ పేరు మోసిన ఛానల్ అయితే ప్యాకేజీ ఇచ్చినట్లు కూడా వార్తలు వచ్చాయి. అందుకే 2024 ఎన్నికల వరకు ఎటువంటి సర్వే నేషనల్ మీడియా



చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూల ఫలితాలు ఇచ్చేవి. కానీ ఎన్నికల ముంగిట వాటి పరిస్థితి మారింది. ఎందుకంటే ప్రజాభిప్రాయం చెప్పాలి. లేకుంటే క్రెడిబిలిటీ దెబ్బతింటుంది. అందుకే వాస్తవ ఫలితాలు అప్పట్లో ఇచ్చాయి నేషనల్ మీడియా సంస్థలు. అయితే ఇప్పుడు అదే నేషనల్ మీడియా సంస్థలు ఎలాహంక ప్యాలెస్ కు క్యూ కడుతుండడంతో.. తప్పకుండా అనుకూల ఫలితాలతో సర్వే లు వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ రెండేళ్ల కూటమి పాలనపై ఫలితాలు వెల్లడించినా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పనితీరు మెరుగుపడిందని చెప్పినా అది యలహంక ప్యాలెస్ ఒప్పందాలేనని స్పష్టమవుతుంది.

# టీడీపీ వశమైన మండలి

విజయవాడడిసెంబర్ 07 (భారత శక్తి)

ఏపీలో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ కూటమి పావులు కదుపుతోంది. ఇటువంటి సమయంలో శాసనమండలిలో ఐదుగురు వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం వైపు శాసనమండలి చైర్మన్ మొగ్గు చూపుతున్నారు. ఏడాది కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓ ఆరుగురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. అయితే ఆ రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. దానికి కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనమండలి చైర్మన్. ఆ రాజీనామాలు ఆమోదిస్తే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గుతుంది. మరికొందరు ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి శాసనమండలిని తమ వైపు తిప్పుకోనుంది కూటమి ప్రభుత్వం. అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరింత డ్యామేజ్ జరుగుతుంది. ఇన్ని రోజులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీల రాజీనామాలను ఆమోదించక పోవడానికి అదే కారణం. కోర్టు జోక్యంతో ఇప్పుడు ఓ అయిదుగురు రాజీనామాలకు చైర్మన్ ఆమోదం తెలిపారు. అయితే జాకీయాఖానం రాజీనామాతో పెద్దగా ప్రయోజనం లేకపోవడంతో ఆమె ఉపసహరించుకున్నారు. ఎందుకంటే ఆమెకు మరో ఆరు నెలల మాత్రమే పదవీకాలం ఉంది. ఆమె రాజీనామా చేసిన ఉప ఎన్నిక రాదట.శాసనమండలి ద్వారా రాజకీయాలను చేయాలనుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే ఆ పార్టీకి శాసనమండలిలో బలం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైన నాటికి శాసనమండలిలో ఆ పార్టీకి ఉన్న బలం 38 మంది ఎమ్మెల్సీలు. కానీ ఈ 18 నెలల కాలంలో ఓ ఆరుగురు ఎమ్మెల్సీలు పదవీ విరమణ చేశారు. దీంతో వైసిపి బలం 32 కు చేరుకుంది. అయితే తాజాగా ఈ ఐదుగురు ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదంతో ఆ సంఖ్య 27కు చేరుకోనుంది. అయితే ఇదే అదునుగా మరో నాలుగురు ఐదుగురు ఎమ్మెల్సీలతో రాజీనామా చేయిస్తే.. కూటమి బలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కంటే అధిగమిస్తుంది. ఆ మరు క్షణం మాత్రం శాసనమండలి కూటమి వశం అవుతుందిశాసనమండలి చైర్మన్గా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మోసేన్ రాజు ఉన్నారు. ఆయన పదవీకాలం 2028 చివరి వరకు ఉంది. ఆపై శాసనమండలి లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఆ బలం చెక్కుచెదరకూడదని వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామాను ఆమోదించలేదు మోసేన్ రాజు. ఆయన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేత. అయితే కూటమికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెక్ పెట్టేందుకు శాసనమండలి నివేదికగా చేసుకుంది. అందుకే శాసనమండలి పై ఫుల్ ఫోకస్ పెట్టింది కూటమి. ఈ ఐదుగురు రాజీనామాను అధికారికంగా ఆమోదించిన మరుక్షణం మరికొందరు వైసీపీ ఎమ్మెల్సీలు రాజీనామా చేసే అవకాశం ఉంది. వారి రాజీనామాలను సైతం ఆమోదిస్తే శాసనమండలిని చేజిక్కించుకోనుంది తెలుగుదేశం కూటమి. అయితే మున్ముందు రాజకీయ పరిణామాలు మరింత ముదిరే అవకాశాలు మాత్రం ఉన్నాయి.

# శాసించే స్థాయికి ఎదిగేందుకు ప్లాన్

గుంటూరు,డిసెంబర్ 07 (భారత శక్తి)

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి కూటమి ప్రభుత్వంలో పదవులను యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ఆయన ఉన్నట్లు కనపడుతుంది. ఈసారి గతం కంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడానికి ఆయన సన్నద్ధమవుతున్నారు. అందుకే వరసగా జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. తనకున్న ఇమేజ్ తో పాటు పార్టీ బలగాన్ని కూడా పెంచుకుంటే నియోజకవర్గాలను వీలయినన్ని ఎక్కువ సంఖ్యలో తీసుకుని ప్రభుత్వంలో బలంగా మారేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆయన వ్యవహారశైలితో కనపడుతుంది.మౌనంగా ఉంటూ తన పని తాను చేసుకుంటూ పోతూనే ఉప ముఖ్యమంత్రిగా జిల్లాలతో పాటు జనసేనకు పట్టున్న ప్రాంతాల్లో ఈసారి ఖచ్చితంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచి మొదలు పెడితే కానీ అప్పటికి అభ్యర్థులను ఖరారు చేయడంతో పాటు నమ్మకమైన నేతలు, క్యాడర్ మెచ్చిన లీడర్లు దొరకరు. అందుకోసం పవన్ కల్యాణ్ నియోజకవర్గాల వారీగా నివేదికలను తెప్పించుకుని తనకు సమయం దొరికినప్పుడల్లా వాటిని అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలు మాత్రమే కాకుండా కోస్తా జిల్లాలు, రాయలసీమలోని చిత్తూరు జిల్లాలోనూ పాగా వేయాలని చూస్తున్నారు.అందుకు అవసరమైన యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని నిర్ణయించారు.

# బుగ్గన నుంచి ధర్మాన వరకూ అందరూ సైలెంట్



కర్నూలు, డిసెంబర్ 07 (భారత శక్తి):(

ఏపీలో అధికార పార్టీ అగ్రనేతలు తమ ఎమ్మెల్యేలను దారిన పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ అలాంటి రాజకీయ పరిస్థితుల్ని క్యాష్ చేసుకునే పరిస్థితుల్లోలేదు. 2024 ఎన్నికల్లో ఊహించని ఓటమి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్ట్ టైమ్ రాజకీయాలు చేస్తున్నారు. బెంగళూరుకు స్థిరనివాసం మార్చారు. వారానికి రెండు, మూడు రోజులే తాడేపల్లికి వస్తున్నారు. సీనియర్ నేతలు కూడా అలాగే ఉన్నారు. కొంత మంది ప్రెస్ మీట్లకు పరిమితమైతే చాలా మంది ఆ పని కూడా చేయడం లేదు. దీంతో వైసీపీ రాజకీయం పూర్తి స్తబ్దుగా మారిపోయింది. పార్టీ ఓడిపోయాక.. కొంత మంది నేతలు పార్టీ వీడిపోయారు. పార్టీలో ఉన్న వారు యాక్టివ్ గా లేరు. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పెద్దిరెడ్డి, అయోధ్య రామిరెడ్డి, ధర్మాన సహా ఎవరూ రాజకీయాలు చేయడం లేదు. బొత్స సత్యనారాయణ అప్పుడప్పుడు మీడియా సమావేశాలు పెడుతున్నారు. దీనికి కారణం జగన్ తీరేనని పార్టీ నేతలు చెబుతున్నారు. అధికారంలో ఉన్న సమయంలో ఎవరి సూచనలను తీసుకోలేదు. కనీసం ఫీడ్ బ్యాక్ కూడా తీసుకోలేదు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకోవడంతో పార్టీ ఘోరంగా దెబ్బతిన్నది. సీనియర్ నేతలు కూడా జగన్ పరిపాలన తీరుతో నొచ్చుకున్నారు. అందుకే తర్వాత సైలెంట్ అయ్యారు. వైసీపీలో సీనియర్ నేతలు బయటకు రావడం లేదని పార్టీ కార్యక్రమాలను పట్టించుకోవడం ఇటీవల జగన్ తాడేపల్లికి పిలిపించుకుని క్లాస్ పీకుతున్నారన్న ప్రచారం జరిగింది. అయితే అలాంటి నేతలు నోరు మెదిపితే కేసులు పడతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. జోగి రమేష్ నుంచి రోజా వరకూ అందరి కథ అదే. జోగి రమేష్ కొన్నాళ్లు జైలుకెళ్లకుండా పోరాడారు కానీ తర్వాత తప్ప లేదు. కొడాలి నాని, పేర్ని నాని, అనిల్ కుమార్ యాదవ్ ఇలా నోరున్నా నెతలంతా ఇప్పుడు వీలైనంత మౌనం పాటిస్తున్నారు. పేర్నినానితో పాటు అంబటి రాంబాబు మాత్రమే ఎక్కువగా మీడియా ముందుకు వస్తున్నారు. వీరంతా గతంలో టీడీపీ నేతల్ని ఇష్టం వచ్చినట్లుగా తిట్టిన వారే. వైఎస్ఆర్‌సీపీలో సీనియర్ నేతల చురుకుతనం లేకపోవడానికి మరో ప్రధాన కారణం సజ్జల రామకృష్ణారెడ్డి పెత్తనం. జగన్ చుట్టూ ' కోటరీ ఉందని .. వారే నిర్ణయాలు తీసుకుంటూ, సీనియర్ నేతలు, కార్యకర్తలు జగన్‌ను కలవకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. ఈ కోటరీకి నాయకుడు సజ్జల అని చెబుతారు. పార్టీ పరమైన నిర్ణయాలను జగన్ పట్టించుకోవడం లేదు. అంతా సజ్జలే చేస్తున్నారు. సజ్జల ఆదేశాలను తాము పాటించడం ఏమిటని సీనియర్ నేతలు కార్యక్రమాలు తగ్గించుకున్నారు. పార్టీ అధినేత జగన్ గతంలోజిల్లాలు పర్యటిస్తామని చెప్పారు.కానీ ఇప్పుడు అలాంటి ఆలోచనలు పెట్టుకోవడం లేదు. జగన్ పార్ట్ టైమ్ గా రాష్ట్రానికి వచ్చి పోతూంటే..తాము మాత్రం ఎందుకు కష్టపడాలని సీనియర్లు అనుకుంటున్నారు. వారందరికీ జగన్ మళ్లీ పూర్తి స్థాయి రాజకీయాలు చేస్తేనే ధైర్యం వస్తుంది. కానీ జగన్ పాదయాత్ర వరకూ మళ్లీ పూర్తి స్తాయి రాజకీయాలు చేసే అవకాశాల్లేవని ఎక్కువ మంది నమ్ముతున్నారు.

# పుతిన్ కు మోడీ గిఫ్ట్లు ఏంటో తెలుసా

న్యూఢిల్లీడిసెంబర్ 07 (భారత శక్తి)

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అందించిన బహుమతులు కేవలం కానుకలు మాత్రమే కాదు.. అవి భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని, కళాత్మక వారసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా రష్యన్ భాషలోని భగవద్గీతతో పాటు అస్సాం తేయాకు, కాశ్మీర్ కుంకుమ పువ్వు, వెండి గుర్రం, అలంకరించబడిన టీ సెట్, పాలరాతి చదరంగం సెట్‌ను కూడా మోదీ బహూకరించారు.రష్యన్ భాషలోకి అనువాదం చేసిన శ్రీమద్ భగవద్గీతశ్రీమద్ భగవద్గీత కాపీనిపుతిన్‌కు అందించారు మోదీ. మహాభారత యుద్ధ సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు అందించిన ధర్మం, శాశ్వత మోక్షం గురించిన మార్గదర్శకాన్ని ఈ గ్రంథం అందిస్తుంది. దీని కాలాతీత జ్ఞానం నైతిక జీవనాన్ని, మనస్సు నియంత్రణను మరియు అంతర్గత శాంతిని ప్రేరేపిస్తుంది. అలాగే సారవంతమైన బ్రహ్మపుత్ర మైదానాలలో పెరిగే అస్సాం బ్లాక్ టీ (నల్ల తేయాకు) బలమైన మాల్టీ రుచికి, ప్రకాశవంతమైన ద్రవానికి ప్రసిద్ధి చెందింది. 2007లో జీఐ ట్యాగ్ పొందిన ఈ తేయాకు.. భూమి, వాతావరణం, హస్తకళల గొప్ప వారసత్వాన్ని సూచిస్తుంది.

మహారాష్ట్రలోని స్వర్ణకారులు తయారు చేసిన ఓ వెండి గుర్రాన్ని కూడా మోదీ పుతిన్‌కు అందజేశారు. అయితే ఈ వెండి గుర్రం భారతదేశ లోహపు హస్తకళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇది భారతీయ, రష్యన్ సంస్కృతులలో గౌరవం, ధైర్యాన్ని సూచిస్తుంది. ముందుకు సాగుతున్న దీని భంగిమ భారతదేశం–రష్యా భాగస్వామ్యం యొక్క శాశ్వతమైన, నిరంతర పురోగతికి ప్రతీకగా నిలుస్తుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లోని గొప్ప కళాత్మకతను ప్రతిబింబిస్తూ, క్లిష్టమైన చెక్కడాలతో రూపొందించబడిన ఈ ముర్షిదాబాద్ వెండి టీ సెట్, ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహాన్ని, టీ సంస్కృతి ప్రాముఖ్యతను పంచుకుంటుంది.ఆగ్రాకు చెందిన రాయితో అది కూడా చేతులతోనే తయారు చేసిన పాలరాతి చదరంగం సెట్‌ను మోదీ పుతిన్‌కు అందజేశారు. ఇవి మాత్రమే కాకుండా కాశ్మీర్ ఎత్తైన ప్రాంతాలలో సాగు చేసే కాశ్మీరీ కుంకుమ పువ్వును బహుమతిగా ఇచ్చారు. ఇది రంగు, సువాసన, రుచికి ప్రసిద్ధి చెందింది కాగా.. దీనికి సాంస్కృతిక, వంటల ప్రాముఖ్యత కూడా ఉంది. ఈ బహుమతుల ద్వారా మోదీ పుతిన్‌కు భారతదేశపు గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ.. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేశారు.

## ఉభయ గోదావరి జిల్లాల్లో

# రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

ఏలూరు,డిసెంబర్ 07 (భారత శక్తి)


వైసీపీ ప్రభుత్వంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి.. ఉభయ గోదావరి జిల్లాల నుంచి




సేకరించిన రేషన్ బియ్యాన్ని ప్రోసెసింగ్ చేసి ఆపై కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సివిల్ సప్లై మినిస్టర్ నాదెండ్ల మనోహర్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టి టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యాన్ని సీజ్ కూడా చేయించారు. చాలా చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేయించారు. కానీ రేషన్ బియ్యం ఎక్కడో అక్కడ అధికారుల దాడుల్లో చిక్కుతూనే ఉంది. ఊళ్లు దాటి చేరాల్సిన చోటకి యథేచ్ఛగా తరలిపోతోంది. ఇటీవల కాలంలో ప్రజల నుంచి వచ్చిన సమాచారంతో పలు చోట్ల టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం దొరికింది.రాజోలు మండలం తాటిపాక గ్రామంలో అశోక్ లేలాండ్ వ్యానులో మండపేటకు అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. రేషన్ డీలర్ సత్యనారాయణ వద్ద నుంచి ఈ వ్యాను బియ్యం లోడుతో బయలుదేరగా అడ్డుకుని పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. పీడీఎస్ బియ్యం లోడుతో ఉన్న వ్యాన్ సీజ్ చేసిన పోలీసులు రేషన్ డీలర్ సత్యనారాయణ, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వం రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఎటువంటి పటిష్ట చర్యలు తీసుకుంటున్నప్పటికీ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఆగడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విషయంలో ప్రముఖంగా రేషన్ డీలర్ల పాత్ర చాలా కీలకంగా ఉందని ఇటీవల జరిగిన ఘటనల్లో స్పష్టం అవుతోంది. రేషన్ డిపోలకు వచ్చిన సరకును ఈ పోస్ యంత్రాల ద్వారా కార్డుదారుని వేలి ముద్రలను తీసుకుని రేషన్ ఇవ్వాల్సి ఉండగా చాలా మంది రేషన్ బియ్యం తినక ఎంతో కొంతకు రేషన్ డీలరుకు విక్రయించేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ బియ్యాన్ని పెద్ద మొత్తంలో కూడబెట్టి ఇలా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించే ముఠాకు లాభానికి అమ్ముకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టడానికి కొంత మంది కార్డు దారులు పరోక్షంగా ప్రోత్సాహం అందిస్తుండగా ఇదే అదనుగా తక్కువ ధరకు కొనుగోలుచేసిన బియ్యాన్ని అధిక రేట్లకు అమ్ముకుంటున్న కొంత మంది రేషన్ డీలర్లు కూడా కారణంగా నిలుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..పీడీఎస్ బియ్యం పట్టుబడ్డ వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నారు అధికారులు. ఈ సెక్షన్లపై నమోదైన కేసుల్లో చాలా మంది చాలా సునాయాసంగా బయట పడగలగడం వల్ల బయటకు వచ్చి మళ్లీ ఇదే అక్రమ మార్గంలో వెళ్తున్నారు. అందుకే చాలా మంది పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో పట్టుబడ్డ వారిలో ఎక్కువగా పాత నేరస్తులే ఉండడం పరిపాటిగా మారింది. గతంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓ సందర్భంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఈతరహా చట్టాల అమలుతోనే ఎంతో కొంత పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కట్టడి అయ్యే అవకాశాలున్నాయని, లేకపోతే అక్రమ మార్గంలో తరలిపోతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డకట్ట వేయలేమని పలువురు హితవు పలుకుతున్నారు..

# విశాఖపట్నంలో వీఎంఆర్‌డీఏ ఇంటిగ్రేటెడ్ కార్డులు

విశాఖపట్టణం,డిసెంబర్ 07 (భారత శక్తి)



విశాఖపట్నంలో పర్యాటకుల కోసం వీఎంఆర్‌డీఏ ఒక కొత్త ప్లాన్ తీసుకొస్తోంది. 'ఇంటిగ్రేటెడ్ కార్డు' పేరుతో రాబోతున్న ఈ కార్డుతో తొమ్మిదికి పైగా పర్యాటక ప్రదేశాలను సులభంగా, తక్కువ ఖర్చుతో సందర్శించవచ్చు. రోజువారీ సందర్శకులను, స్థానికులను దృష్టిలో ఉంచుకొని ఈ కార్డును రూపొందిస్తున్నారు. త్వరలోనే అందుబాటులోకి రానున్న ఈ విధానం విశాఖ పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని భావిస్తున్నారు. విశాఖపట్నంలో పర్యాటకులను ఆకట్టుకోవడానికి, ఆదాయాన్ని పెంచడానికి కీలక నిర్ణయం తీసుకున్నారు. వీఎంఆర్‌డీఏ ఇంటిగ్రేటెడ్ కార్డు పేరుతో పర్యాటకుల కోసం కొత్త ప్లాన్ తీసుకురాబోతోంది. ఈ కార్డుతో నగరంలోని మ్యూజియంలు, పార్కులు వంటి తొమ్మిదికి పైగా పర్యాటక ప్రదేశాలను సందర్శించవచ్చు. ఒక రోజు నుంచి ఏడాది వరకు కాలపరిమితితో ఈ కార్డులను అందించాలని భావిస్తున్నారు. రోజూ నడకకు వెళ్లేవారు, తరచుగా పార్కులకు వచ్చేవారిని దృష్టిలో ఉంచుకొని వీటిని సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ఈ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. సభ్యత్వం ఆధారంగా ఉచిత ప్రవేశం కల్పించడంతో పాటు, క్యూఆర్ కోడ్, పాస్ విధానంలో దీన్ని అమలు చేస్తారు. ఈ కార్డు ద్వారా విశాఖ పర్యాటకం గురించి కూడా ప్రచారం చేయాలని నిర్ణయించారు.ఈ ఇంటిగ్రేటెడ్ కార్డుతో విశాఖపట్నంలో పర్యాటక అనుభవాన్ని మరింత మెరుగుపరచాలని వీఎంఆర్‌డీఏ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్డును కొనుగోలు చేసినవారు, నగరంలోని వివిధ ఆకర్షణలను సులభంగా, తక్కువ ఖర్చుతో సందర్శించవచ్చు. ముఖ్యంగా, స్థానికంగా నివసించేవారు, రోజూ పార్కులకు వెళ్లేవారు ఈ సభ్యత్వ కార్డుల ద్వారా ప్రయోజనం పొందుతారు. ఈ కార్డుల అమలులో భాగంగా, క్యూఆర్ కోడ్ టెక్నాలజీని ఉపయోగిస్తారు. దీనివల్ల ప్రవేశ ప్రక్రియ వేగవంతం అవుతుంది. అలాగే, ఈ కార్డులపైనే విశాఖపట్నం పర్యాటక విశేషాలను ప్రచారం చేయడం ద్వారా, మరిన్ని సందర్శనలను ప్రోత్సహించాలని యోచిస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా వీఎంఆర్‌డీఏ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు.ఇప్పటివరకు విశాఖపట్నంలో పర్యాటకులు ప్రతి పర్యాటక ప్రదేశానికి విడివిడిగా టికెట్లు కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీనివల్ల సమయం వృధా అవ్వడమే కాకుండా, ఖర్చు కూడా పెరిగిపోయేది. అయితే, ఇకపై ఈ సమస్య ఉండదు. వీఎంఆర్‌డీఏ ఈ ఇంటిగ్రేటెడ్ కార్డును ప్రవేశపెట్టబోతోంది. ఈ కార్డుతో పర్యాటకులు అన్ని పర్యాటక ప్రదేశాలను సులభంగా, తక్కువ ఖర్చుతో సందర్శించవచ్చు. సాధారణంగా, ఒక పెద్దవారు అన్ని పర్యాటక ప్రదేశాలను సందర్శించాలంటే టికెట్ల కోసం రూ.485 ఖర్చు చేయాల్సి వస్తుంది. అదే పిల్లలకైతే రూ.250 అవుతుంది. కానీ, ఈ కొత్త ఇంటిగ్రేటెడ్ కార్డును తీసుకుంటే, పెద్దలు కేవలం రూ.250 నుండి రూ.300 మధ్యలోనే అన్ని ప్రదేశాలను చూడగలుగుతారు.ఈ కొత్త విధానం అమలులోకి రావడానికి మరో రెండు నెలల సమయం పట్టనుంది. దీనికోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా, ప్రతి పర్యాటక ప్రదేశంలో టికెట్ల కోసం నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. అంతేకాకుండా, ఈ కార్డుతో పర్యాటకులు తమకు నచ్చిన కొన్ని ప్రదేశాలను కూడా ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఈ ఇంటిగ్రేటెడ్ కార్డులో క్యూఆర్ కోడ్ సౌకర్యం కూడా ఉంటుంది. దీని సహాయంతో, ఎవరు ఎన్నిసార్లు ఏ ప్రదేశాన్ని సందర్శించారనే వివరాలను కూడా సులభంగా తెలుసుకోవచ్చు. ఇది పర్యాటకుల సంఖ్యను అంచనా వేయడానికి, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి చాలా బాగా ఉపయోగపడుతుంది అంటున్నారు.

# ఆక్వారంగంకు దెబ్బమీద దెబ్బ

అమలాపురం, డిసెంబర్ 07 (భారత శక్తి)

ఆక్వారంగంకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. డాలర్ల పంటగా పేరు గడించిన ఆక్వా పరిశ్రమ వరుస ఇబ్బందులతో సతమతమవుతోంది. దేశంలో రాష్ట్రానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చిపెడుతోన్న ఆక్వా పరిశ్రమ మొత్తం మీద నష్టాల ఊబిలోకి వెళ్తోంది. మొన్నటి వరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాదిన టారీఫ్ బాదుడుకు కుదేలైన ఏపీలోని ఆక్వా రంగం. ఎక్స్ ఫోర్టర్ల సిండికేట్‌కు మరింత నష్టపోయి లబోదిబో మంటోంది. ఇప్పుడు అనుకూలించని వాతావరణం మరో రకంగా దెబ్బతీసింది. నాణ్యత లేని సీడ్‌ను అంటగట్టిన హేచరీల నిర్వాకానికి ఆక్వా రైతులు మరింత నష్టాల ఊబిలోకి వెళ్లిపోయే పరిస్థితి దాపురించింది. నాణ్యత లేని సీడ్ కారణంగా రోజులు గడుస్తున్నా రొయ్యల ఎదుగుదల్లో ఎటువంటి మార్పు లేకపోగా పెట్టుబడి మాత్రం నీళ్లలో పోసినట్టుంది. నాసీరకం సీడ్‌ను చెరువుల్లో వేయడం ద్వారా పెట్టిన పెట్టుబడితోపాటు పంటకాల వ్యవధి నష్టపోతుండగా ఈ వైరస్ మూలాలు తొలగించుకునేందుకు డిస్ ఇన్ఫెక్షన్ ఖర్చుకు మరో రూ.30వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు..

అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆక్వా రైతులకు ఇప్పుడు పిడుగులాంటి నిజం తెలిసి లబోదిబో మంటున్నారు. ఎన్నో ఆశలతో చెరువుల్లో సీడ్ వేసిన రైతులకు 40 రోజుల నుంచి 60 రోజుల కాల వ్యవధి దాటుతున్నా 200 కౌంట్‌ను దాటి రావడం లేదు. చెరువుల్లో రోజూ వారీ మేత చల్లడం, ఏరియేటర్ల నిర్వహణ, ఇతర మందులు వేయడం అన్నీ సజావుగా జరుగుతున్నా ఎదగని రొయ్యలను చూసిన రైతులు కంగారుపడుతున్నారు. ఏమయ్యిందా అన్న అనుమానంతో సర్టిఫైడ్ ల్యాబ్‌లో టెస్టులు చేయించారు. దీంతో అసలు రంగు బయట పడింది. పరీక్షకు పంపిన రొయ్యల్లో ఈహెచ్‌పీ తెగులు ఉన్నట్లు వెల్లడైంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరులో చాలా మంది రైతులు బాపట్లకు చెందిన హేచరీ నుంచి సీడ్‌ను కొనుగోలు చేశారు. చెయ్యేరుకు చెందిన నాగు అనే రైతు ఈ హేచరీ నుంచి ఈ ఏడాది అక్టోబర్ 8, 9 తేదీల్లో 57.81లక్షల సీడ్‌ను కొనుగోలు చేశాడు. చెరువుల్లో వేసిన రొయ్యపిల్ల ఎటువంటి ఎదుగుదల కనిపించకపోయేసరికి అనుమానంతో నవంబర్ 6న శ్రీ కోనసీమ పీసీఆర్ ఆక్వా ల్యాబ్‌లో టెస్టులు చేయించారు. రిజల్ట్‌లో ఈహెచ్‌పీ పాజిటీవ్ రాగా హేచరీ సీడ్ నాణ్యత లేనిదని తేలిందని రైతులు వాపోయారు. వారు సరఫరా చేసిన సీడ్‌లో నాణ్యత లేదని, ఈహెచ్‌పీ పాజిటీవ్ ఉన్న సీడ్ అని తెలిసినా కూడా సదరు హేచరీ ఉద్దేశ్యపూర్వకంగానే రైతులను మోసం చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఖచ్చితంగా తెగులు సోకిన సీడ్‌ను సదరు హేచరీ అంటగట్టడం వల్లనే తామంతా తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. నాణ్యత లేని సీడ్‌ను రైతులకు అంటగట్టి చేతులు దులుపుకున్నబాపట్ల హేచరీపై నవంబర్ 22న కోనసీమ జిల్లా ఫిషరీష్ జేడీకు చెయ్యేరు రైతులు ఫిర్యాదు చేశారు. నాణ్యత కలిగిన సీడ్ అనిచెప్పి వ్యాధి ఉన్నది అంటగట్టిందని, నమ్మిన రైతులను మోసం చేయడమే కాకుండా రైతుల నష్టాలకు కారణం అయ్యిందని దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. అంతే కాకుండా నష్టపోయిన రైతులకు పూర్తి పెట్టుబడి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్టేట్ ఫిషరీస్ కో ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డికి చెయ్యేరు దాసులమ్మ ఆక్వారైతు అసోసియేషన్ ఫిర్యాదు చేసింది.. ఈహెచ్‌పీ వ్యాధి సీడ్‌తో నష్టపోయామని చెయ్యేరు దాసులమ్మ ఆక్వారైతు అసోసియేషన్ రైతుల ఫిర్యాదుతో బుధవారం ఎస్ఎస్‌పీఏడీ, సిఫ్ట్ బృందాలు తనిఖీలు చేశాయి. చెయ్యేరు ప్రాంతంలో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో ఈహెచ్‌పీ వ్యాధి ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. చెయ్యేరులోని 8 అనుమానిత చెరువుల్లోనుంచి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. దాదాపు అన్ని చెరువులు 40 నుంచి 60 రోజుల కల్చర్ దశలో ఉండగా 90 నుంచి 100 కౌంట్ ఉండాల్సి ఉండగా ఎదుగుదల లేక 180 నుంచి 200 కౌంట్ కనిపించింది. మొత్తం మీద నాణ్యత లేని సీడ్ వల్లనే రైతులు ఈ నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఆక్వాకల్చర్‌లో (ముఖ్యంగా రొయ్య సాగులో) చాలా భయం కలిగించే వైరస్ ఈహెచ్‌పీ. ఇది ఒక మైక్రోస్పోరిడియన్ పరాన్నజీవి. ఇది వైరస్ కాదు కానీ చాలా మంది రైతులు దీన్ని "ఇఊఖ వైరస్" అనే అంటారు. ఈహెచ్‌పీ వల్ల రొయ్యల హెపటోపాంక్రియాస్ ని దెబ్బతీస్తుంది. జీర్ణక్రియ తగ్గిపోతుంది, ఆహారం సరిగ్గా జీర్ణం కాదు, పెరుగుదల చాలా నెమ్మదిగా ఉంటుంది. రొయ్యలు చిన్నగానే ఉండిపోతాయి, 60-80 రోజులకే 10-15 గ్రాములు కూడా రాకపోవచ్చు. మరణం ఎక్కువగా ఉండదు కానీ ఉత్పత్తి భారీగా పడిపోతుంది.



30 శాతం నుంచి 70 శాతం వరకు నష్టం వాటిల్లుతుంది. రొయ్యలు పెరగడం ఆగిపోవడం, పొట్ట ఖాళీగా ఉండటం, గట్ కనిపించకపోవడం, రొయ్యల సైజు ఒకేలా లేకపోవడం, మెత్తని షెల్, శరీరం లేత రంగు, వైట్ ఫీకల్స్ కొన్నిసార్లు కలిసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈహెచ్‌పీ వ్యాధితో ఉన్న నాసీరకం సీడ్‌ను రైతులకు అంటగడుతున్న హేచరీ మోసాలపై ఏపీ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈహెచ్‌పీ వ్యాధి ఉన్న సీడ్‌ను బాపట్లకు చెందిన హేచరీ అంటగట్టి మోసం చేసింది. దీనిపై ఇప్పటికే పిర్యాదు చేసినా అధికారులు ఆ హేచరీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు చెబుతున్నారు. ఈ హేచరీలో సీడ్ కొనుగోలు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇటువంటి హేచరీలను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదుచేసి లైసెన్స్‌లు రద్దు చేయాలి.

# డోనర్స్.. షాకిచ్చారు...

విజయవాడ, డిసెంబర్ 07 (భారత శక్తి)


ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ, వైసీపీకి విరాళాలు భారీగా తగ్గాయి. వైసీపీకి కూడా అంతే స్థాయిలో తగ్గాయి. 2024 లో జరిగిన ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఈ రెండు పార్టీల విషయంలో విరాళాలు భారీగా తగ్గడంపై పార్టీ నాయకత్వం ఆలోచిస్తుంది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి అధికమొత్తంలో విరాళాలు అందుతాయి. కొంత మొత్తం ఎలక్ట్రోరల్ బాండ్స్ రూపంలో నూ లభిస్తాయి. అయితే 2024 జూన్ నెలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటకీ విరాళాలు తగ్గాయి. అదేసమయంలో మిత్ర పక్షంగా ఉన్న జనసేనకు 25.33 కోట్ల రూపాయలు అందాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే టిడిపి విరాళాలు తగ్గినట్లు కనిపిస్తుంది. ప్రముఖ ఫార్మా కంపెనీ నాట్కో రెండు పార్టీలకూ ప్రధానంగా విరాళాలను అందించింది.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి గత ఆర్థిక సంవత్సరంలో 83 కోట్లకు పైగా విరాళాలు వచ్చాయి. అంతకుముందు ఏడాది ఈ మొత్తం 100 కోట్ల రూపాయలకు పైగా ఉంది. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీకి, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న జనసేన పార్టీకి 2024?25లో 25.33 కోట్లకు పైగా విరాళాలు పొందినట్లు తెలిపింది. ఫార్మా సంస్థ నాట్కో విరాళాల్లో ఎక్కువ మొత్తాన్ని విరాళం రూపంలో అందించింది. నాట్కో సంస్థ తెలుగుదేశం పార్టీకి ఏడు కోట్ల రూపాయలు, జనసేనకు 1.5 కోట్ల రూపాయలను విరాళంగా అందించింది.మరోవైపు తెలుగుదేశం పార్టీకి 2023?24లో మొత్తం 100 కోట్లకు పైగా పొందగా, అందులో 33 కోట్లు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వచ్చాయి. విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 2024?25లో మొత్తం 140 కోట్లకు పైగా విరాళం రూపంలో దక్కాయి. అందులో 113 కోట్లు ఎలక్టోరల్ బాండ్ల మార్గంలో వచ్చాయి. నాట్కో ఫార్మా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా 10 కోట్ల రూపాయలు విరాళంగా ఇచ్చింది. గత జూన్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ భారీ ఓటమి చవిచూసిన తర్వాత, ఈ పార్టీకి వచ్చిన మొత్త విరాళాలు 3.94 కోట్ల రూపాయలకే పరిమితమయ్యాయి.

# డీకేకు నోటీసులు

బెంగళూరు,డిసెంబర్ 07 (భారత శక్తి)

నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు జారీ చేసింది. ఆర్థిక విషయాలు, లావాదేవీలపై శివకుమార్ వివరణ కోరుతూ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 19లోపు వివరాలు సమర్పించాలని ఈవోడబ్ల్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై దిల్లీ పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు ఢిల్లీ పోలీసుల ఆధ్వర్యంలోని ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తో పాటు ఆయన సోదరుడు, ఎంపీ డీకే సురేష్‌లకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల్లో యంగ్ ఇండియన్ సంస్థకు ఇచ్చిన రూ.2.5 కోట్ల విరాళాల వివరాలు, మూలం, ఆర్థిక లావాదేవీల డాక్యుమెంట్లు డిసెంబర్ 19లోపు సమర్పించాలని ఆదేశించింది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ అగ్ర నేతలు తమ పదవుల్ని దుర్వినియోగం చేశారనేది ఆ ఫిర్యాదు. ఈడీ ఇచ్చిన సమాచారంతో ఎఫ్ఐఆర్‌లో వారిపై నేరపూరిత కుట్ర సంబంధిత అభియోగాలు మోపారు. ఆ జాబితాలో మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దుబె, శాం పిట్రోడా కూడా ఉన్నారు. వీరందరూ కేవలం రూ.50 లక్షలు చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2వేల కోట్ల విలువైన ఆస్తులపై అధికారాన్ని పొందారని ఆరోపించింది.శివకుమార్‌కు పంపిన నోటీసుల్లో సంబంధిత డాక్యుమెంట్లు పంపినా, తమ ముందు వ్యక్తిగతంగా హాజరైనా..సరిపోతుందని అధికారులు పేర్కొన్నారు. ఆ నోటీసులలో ప్రధానంగా యంగ్ ఇండియన్‌కు ఇచ్చిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆ డబ్బు ఎందుకు ఇచ్చారు.. ఏ ఉద్దేశ్యంతో ఇచ్చారో చెప్పాలన్నారు. అందుకు డొనేషన్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయా,



సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, నేతలతో ఈ లావాదేవీపై ఏదైనా చర్చ జరిగిందా? ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందో చెప్పాలంటూ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసులు డీకే శివకుమార్‌కు ఇచ్చిన నోటీసుల్లో ప్రశ్నల వర్షం కురిపించారు.కాగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లు యంగ్ ఇండియన్ సంస్థలో 38 శాతం చొప్పున షేర్లు కలిగి ఉన్నారని ఈడీ ఆరోపించింది. ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.90.21 కోట్ల రుణాన్ని రూ.9.02 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చి.. ఆ షేర్లను రూ.50 లక్షలకు యంగ్ ఇండియన్‌కు బదిలీ చేశారని పేర్కొంది. తద్వారా రూ.2 వేల కోట్ల నుండి రూ.5 వేల కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులపై నియంత్రణ సాధించారని ఈడీ ఆరోపించింది. దీంతో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ సెక్షన్లు 3, 4, మరియు 70 కింద వారిపై ఛార్జిషీటు దాఖలు చేశారు. ఏప్రిల్ 11, 2025న ఈడీ ఢిల్లీ, ముంబై, లక్నోలలో రూ.661 కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులను సైతం ఆటాచ్ చేసిన విషయం తెలిసిందే.

# గ్లోబల్ సమ్మిట్ పైనే ఆశలన్నీ




హైదరాబాద్,డిసెంబర్ 07 (భారత శక్తి)

లంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 కోసం రేవంత్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. భారీ సంఖ్యలో విదేశీ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వ్యాపార దిగ్గజాలు వస్తున్న సమ్మిట్‌కు ఎలాంటి అవంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ భవితవ్యాన్ని, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని ప్రపంచ పటంలో సగర్వంగా నిలిపేందుకు ఉద్దేశించిన ఈ సమావేశానికి కేవలం రోజుల టైం మాత్రమే ఉంది. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటో దాదాపు వంద ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో ఈ గ్లోబల్ సమ్మిట్‌కు ముస్తాబు చేస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా భావించిన ప్రోగ్రామ్‌లో 20247 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ప్రత్యేక విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించబోతున్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులతో కూర్చొని తుది మెరుగులు దిద్దుతున్నారు. గ్లోబల్ సమ్మిట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ సంఖ్యలో వీవీఐపీలు రానున్నారు. అందుకు తగ్గట్టుగానే అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ ఆశలతో ఏర్పాటు చేస్తున్న సమ్మిట్‌కు 40కుపైగా దేశాల నుంచి దాదాపు 15వందల మంది విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరిలో చాలా మంది ఐటీ బ్యాక్‌గ్రౌండ్ కలిగిన వాళ్లు, గూగుల్, అమెజాన్, ఇలా ప్రపంచంలోనే టాప్ కంపెనీల నుంచి వస్తున్నారు. ఫార్మా బ్యాంకింగ్, ఎడ్యుకేషన్, రంగాలకు చెందిన వాళ్లు కూడా సమావేశానికి హాజరవుతున్నారు. అందుకే ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వానికే కాకుండా మిగతా రాష్ట్రాలు కూడా ఆసక్తిగా చూస్తున్నాయి. ఇందులో పలువురు ముఖ్యమంత్రులు కూడా పాల్గొంటారని చెబుతున్నారు. డిసెంబర్ 8 అంటే సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు గ్లోబల్ సమ్మిట్ ప్రారంభమవుతుంది. ఇందులో బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లేయర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారు. బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ కె. బెరి, 2025 మిస్‌వ వరల్డ్ సుచతా చువాంగ్ శ్రీ, ట్రంప్ మీడియా టెక్నాలజీ గ్రూప్ సీఈవో ఎరిక్ స్వైడర్ మొదటి రోజు వేదికపై కనిపించనున్నారు. వర్చువల్‌గా మైక్రోసాఫ్ట్ ఛైర్మ్ అండ్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, వరల్డ్‌బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బగ్గా లాంటి దిగ్గజాలు సమావేశంలో ప్రసంగిస్తారు. సినీ, క్రీడా ప్రముఖులు కూడా ఈ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, నటులు రితేస్ దేశ్‌ముఖ్, రిషబ్ శెట్టి కూడా వస్తున్నారు. 26 ప్యానల్ డిస్కషన్స్ జరుగుతాయి. ఇందులో కాలుష్యరహిత ఇంధనం, గ్రీన్ మొబిలిటీ, గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తెలంగాణ, ఏరోస్పేస్, డిఫెన్స్, గిగ్ ఎకానమీ, మూసీ నది పునరుద్ధరణ, ఒలింపిక్స్, సాంస్కృతిక, పర్యాటకం లాంటి అంశాలు చాలానే ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ప్రధానమంత్రి ఈ సదస్సుకు రావడం లేదని తెలుస్తోంది. వందేమాతరంపై డిస్కషన్ ఉన్నందున ఎంపీలు కూడా వచ్చేది అనుమానంగానే ఉంది. గ్లోబల్ సమ్మిట్‌కు భారీ సంఖ్యలో ప్రతినిధులు వస్తున్నందున కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేశారు. దీన్ని సీనియర్ ఐఏఎస్ అధికారులు సబ్యసాచిఘోష్, జయేష్ రంజన, కృష్ణ భాస్కర్ సహా ఐఎస్‌బీ నిపుణులు పర్యవేక్షిస్తున్నారు. ఎప్పుడు ఏ కార్యక్రమం జరగాలని, ఎలాంటి అంశాలు ప్రస్తావించాలి, ప్రభుత్వ ప్రయార్టీలు ఏంటనే విషయాన్ని చర్చించి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ వార్ రూమ్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లీడ్ చేస్తున్నారు. ఆదివారం నాటికి పనులు పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. అప్పటికి ఏమైనా లోపాలు తలెత్తితే సరి చేసేందుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సదస్సు జరుగుతున్న ఫ్యూచర్ సిటీలో భవిష్యత్ ఎలా ఉంటుందో స్పష్టంగా చెబుతోంది ప్రభుత్వం. వంద శాతం అండర్ గ్రౌండ్ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. నిరంతరాయంగా ఎంత ఇంటర్నెట్ కావాలన్నా అందించబోతోంది. ఒకేసారి పదివేల మంది వైఫై వినియోగించుకునేలా సదుపాయం కల్పించింది. ఇంటర్నెట్ కమ్యూనికేషన్ కోసం ప్రత్యేకంగా ఎక్కడికక్కడ క్యూఆర్ కోడ్ ఆధారిత లాగిన్స్ సౌకర్యాన్ని సిద్ధం చేసింది. గ్లోబల్ సమ్మిట్ జరుగుతున్న ప్రాంగణంలో ఎక్కడ కూర్చున్నా సరే కార్యక్రమాలు తెలుసుకునేందుకు వీలుగా భారీ స్థాయిలో ఎల్ఈడీ స్క్రీన్‌లు సిద్ధం చేశారు. మరికొన్ని స్క్రీన్‌లపై తెలంగాణ రైజింగ్‌కు సంబంధించిన సమాచారం కంటిన్యూగా ప్రసారం అవుతుంది. విద్యుత్ కూడా అంతరాయం లేకుండా అందించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. సమావేశ పరిసర ప్రాంతాల్లో భూగర్భ కేబుళ్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ అందిస్తారు. 315 కేవీ సామర్థ్యం ఉన్న మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ సిద్ధంగా ఉంది. ప్రాంగణంలో ఉన్న 8 వేదికల్లో 3,000 టన్నుల సామర్థ్యంతో కూడిన ఏసీ మెషిన్స్ ఫిట్ చే?రు. మొత్తంగా సుమారు 5 వేల మంది సమ్మిట్‌కు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రత విషయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మూడంచెల భద్రత కల్పిస్తున్నారు. వెయ్యికిపైగా సీసీ కెమెరాలు అమర్చి సెంట్రల్ పోలీస్ కంట్రోల్‌రూంకు అటాచ్ చేశారు. లాఅండ్ ఆర్డర్ కోసం 1,500 మంది పోలీసులు, వెయ్యి మంది ట్రాఫిక్ నియంత్రణకే ఉంటారు.

# కుళ్లుకుంటున్న ట్రంప్

న్యూజెర్సీ, డిసెంబర్ 07 (భారత శక్తి):(

మనం బాగుపడితే చాలు ఎవడు ఏమైతే మనకేంది అనుకునేవారు ప్రపచంలో చాలా మంది ఉన్నారు. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ కోవకు చెందినవాడే. అందకే ఆయన ఎన్నికల్లో కూడా అమెరికా ఫస్ట్ నినాదంతో గెలిచారు. అమెరికా కోసం ప్రపంచ దేశాల దిగుమతులపై టారిఫ్‌లు విధించారు. ఇక ప్రపంచంలో ఏ దేశం ఎదిగినా అమెరికాకు కడపు మంట ఆగదు. అందుకే ట్రంప్ ఇటీవల




మన ఎకానమీని డెడ్ ఎకానమీ అని ఏడుపు మొదలు పెట్టాడు. ఆయన ఏడుపు పుణ్యమో ఏమో మన రూపాయి పతనం అవుతోంది. ఇక ఇదే సమయంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు వచ్చారు. 'భారత?రష్యా సంబంధాలు ప్రత్యేకమైనవి, ఎవరికీ వ్యతిరేకం కాదు' అని ప్రకటించారు.పుతిన్ 'అమెరికా రష్యా చమురు కొనకుండా ఆపమని చెప్తుంటే, వారు మా అణు ఇంధనం కొంటున్నారు కదా?' అని ప్రశ్నించారు. భారత్ రష్యాతో సంబంధాలు కొనసాగిస్తూ దౌత్య స్వతంత్రత్వాన్ని కాపాడుతోందని స్పష్టం చేశారు. పాశ్చాత్య ఆంక్షలు ఇరుదేశాల బంధాన్ని బలహీనపరచలేవని ధైర్యంగా ప్రకటించారు.

మోదీ ప్రభుత్వం ట్రంప్ ఒత్తిడికి లొంగకుండా రష్యాతో వాణిజ్య, రక్షణ ఒప్పందాలు కొనసాగిస్తోంది. చైనా, పాకిస్తాన్‌కు కూడా ఈ ప్రకటన హెచ్చరికగా మారింది. భారత్ స్వయం శక్తిగా అవతరించి, ప్రపంచ దేశాలు సంబంధాల కోసం ముందుకు రావాలని పుతిన్ సందేశం.పుతిన్ పర్యటన సందర్భంగా జరిగే ఒప్పందాలు అమెరికా, యూరోప్ దేశాల స్పందనలకు దారితీస్తాయి. భారత్ దౌత్య విధానం ద్వంద్వ స్థితిని అధిగమించి స్వతంత్రంగా ముందుకు సాగుతోంది. ట్రంప్ తన సొంత ఎజెండాతో భారత్‌ను అణచివేయాలని చూస్తున్నారు. కానీ మోదీ మౌనంగా అన్నింటికీ సమాధానం ఇస్తున్నారు. ఇక భారత గడ్డపై పుతిన్ చేసిన వ్యాఖ్యలు ఇటు ట్రంప్‌తోపాటు, పాకిస్తాన్, చైనాకు కూడా ఒక హెచ్చరిక. ఇపుడు భారత్ స్వయం శక్తిగా అవతరించింది. ఏ దేశమైనా భారత్ తో సంబంధాల కోసం ముందుకు రావల్సిందే.

# ఫ్యూచర్ సిటీకి గ్లోబల్ టచ్

హైదరాబాద్, డిసెంబర్ 07 (భారత శక్తి)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్‌సిటీ'కి అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047'కి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ఈ భవిష్య నగరం ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. రంగారెడ్డి జిల్లాలో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నగరాన్ని తీర్చిదిద్దుతున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్‌సిటీ'కి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047'కి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ఈ భవిష్య నగరం ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. ఎన్నో ఆశలు, ఆకాంక్షలు, భారీ అంచనాలతో రంగారెడ్డి జిల్లాలోని మీర్‌ఖాన్‌పేట- ముచ్చర్ల పరిధిలో దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ ఫ్యూచర్‌సిటీని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. మరిన్ని దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో సాహసోపేతంగా ఈ గ్లోబల్ సమిట్‌ను ఈ భావినగరిలోనే ఏర్పాటు చేసింది. ఈ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి అత్యున్నత స్థాయి ప్రతినిధులు ఇక్కడికి రానున్నారు.హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల తరువాత, ఐటీ రంగం రాకతో సైబరాబాద్ మూడో నగరంగా ఎలా ఏర్పడిందో.. ఇప్పుడు అదే స్థాయిలో నాలుగో నగరంగా ఈ ఫ్యూచర్‌సిటీని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తోంది. ఈ ప్రాంతంలో నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగేందుకు వీలుగా ప్రత్యేకంగా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ భావినగరంలో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇప్పటికే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాలు నిర్మాణంలో ఉండగా.. త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ విశ్వవిద్యాలయం, వాటికి




అనుబంధంగా పరిశోధన, ఇంక్యుబేషన్ కేంద్రాలు రాబోతున్నాయి. వీటితో పాటు పారిశ్రామిక పార్కులు, ఐటీ, ఫార్మా సంస్థలు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల కార్యకలాపాలు, అలాగే వారాంతపు ఆటవిడుపు కోసం గేమింగ్ జోన్లు, వినోద కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.ఫ్యూచర్‌సిటీ స్థానం, కనెక్టివిటీ గురించి చూస్తే ఇది 56 గ్రామాలు, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మితమవుతుంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (ాఖీఖీ) వెంట రావిర్యాల మీదుగా ఈ నగరానికి సుమారు 40 కి.మీ. దూరం ఉంటుంది. ఇక్కడికి మెరుగైన రవాణా సౌకర్యం కోసం కొత్తగా 41 కి.మీ. మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మిస్తున్నారు. అదేవిధంగా శ్రీశైలం జాతీయ రహదారి మార్గంలో తుక్కుగూడ నుంచి కేవలం 20 కి.మీ. దూరంలోనే ఈ ఫ్యూచర్‌సిటీ ఉంది. గ్లోబల్ సమిట్ వేదికను మీర్‌ఖాన్‌పేటలోని అమెజాన్ డేటా కేంద్రం కంటే ముందే ఏర్పాటు చేశారు. ఈ వేదిక శంషాబాద్ విమానాశ్రయం నుంచి కేవలం 33 కి.మీ. దూరంలో ఉండగా.. ప్రయాణ సమయం సుమారు 45 నిమిషాలు. అయితే, హైదరాబాద్ నగరం నుంచి (పీవీ ఎక్స్‌ప్రెస్ వే మీదుగా) వెళ్లడానికి గంటకు పైగా, ఎంజీబీఎస్ నుంచి బస్సులో సుమారు గంటన్నర సమయం పడుతుంది.

# హాంక్ మోర్... వెయిట్ మోర్...

హైదరాబాద్, డిసెంబర్ 07 (భారత శక్తి)



హైదరాబాద్‌లో ట్రాఫిక్ కూడళ్ల వద్ద హారన్ మోగింపుతో శబ్ద కాలుష్యం పెరుగుతోంది. ముంబై, బెంగళూరులో విజయవంతమైన 'హాంక్ మోర్.. వెయిట్ మోర్' విధానాన్ని హైదరాబాద్‌లోనూ అమలు చేస్తే శబ్ద కాలుష్యం గణనీయంగా తగ్గుతుందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ఈ టెక్నాలజీ ఆధారిత పరిష్కారం ప్రజలలో మార్పు తెస్తుందని భావిస్తున్నారు.ముఖ్యంగా.. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలైన గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ప్యారడైజ్ సెంటర్లలో శబ్ద తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. కొన్ని సందర్భాల్లో ఈ ప్రాంతాల్లో శబ్ద తీవ్రత ఏకంగా 110 డెసిబుల్స్‌ను కూడా దాటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది దీర్ఘకాలంలో వినికిడి లోపం, ఒత్తిడి, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో, హారన్ మోగించడాన్ని నియంత్రించడం అత్యవసరం. శబ్ద కాలుష్యం అధికంగా ఉన్న నగరాల్లో ముంబయి ఒకటి. దీనిని నియంత్రించేందుకు, ముంబయి ట్రాఫిక్ విభాగం 2020లో వినూత్నమైన 'హాంక్ మోర్.. వెయిట్ మోర్' అనే విధానాన్ని అమలు చేసింది. ఈ పద్ధతి చాలా ఆసక్తికరంగా, ప్రభావవంతంగా ఉంది.ఈ విధానంలో ట్రాఫిక్ కూడళ్ల వద్ద ప్రత్యేక సౌండ్ సెన్సర్‌లను అమరుస్తారు. ఎరుపు సిగ్నల్ పడినప్పుడు, ఎవరైనా వాహనదారులు అనవసరంగా అధికంగా హారన్ మోగిస్తే, ఈ సెన్సర్‌లు ఆ శబ్దాన్ని గుర్తిస్తాయి. శబ్ద తీవ్రత నిర్ణీత పరిమితిని మించితే ఆటోమేటిక్‌గా రెడ్ సిగ్నల్ సమయం దానంతట అదే ఎక్కువ సెకన్లకు పెరుగుతుంది. శబ్ద తీవ్రత నియంత్రణలోకి వచ్చి తగ్గుముఖం పడితేనే గ్రీన్ సిగ్నల్ పడుతుంది. ఈ వినూత్న నిర్ణయం కారణంగా.. ముంబైలోని ఆయా కూడళ్లలో హారన్ మోగించడం ఏకంగా 60 శాతం మేర తగ్గింది. ఈ పద్ధతిని అమలు చేసిన తొలి నగరంగా ముంబై గుర్తింపు పొందింది.ముంబై తరహాలో బెంగళూరు కూడా ఈ ఏడాది జూన్‌లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేసి, సానుకూల ఫలితాలను పొందింది. దురదృష్టవశాత్తు.. దేశంలోనే అత్యధిక శబ్ద కాలుష్యం ఉన్న టాప్-5 నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా ఉంది. ముంబై, బెంగళూరు నగరాల విజయాలను దృష్టిలో ఉంచుకుని.. హైదరాబాద్ ట్రాఫిక్ కూడళ్లలో కూడా ఈ 'హాంక్ మోర్.. వెయిట్ మోర్' విధానాన్ని తీసుకువస్తే అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని పర్యావరణవేత్తలు అంటున్నారు. ఈ టెక్నాలజీ ఆధారిత పరిష్కారం ప్రజలలో మార్పు తీసుకొచ్చి, శబ్ద కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంలో దోహదపడుతుందని చెబుతున్నారు.

=====================

# గ్రామాల్లో పొలిటికల్ హీట్...

హైదరాబాద్,డిసెంబర్ 07 (భారత శక్తి)

సర్పంచ్ ఎన్నికల మూడో విడత నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. రాజకీయ పార్టీలు అన్ని పంచాయ తీల్లో తమ గెలుపు గుర్రాలను బరిలోకి దించాయి. ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద యథావిధిగా ఉంది. వీరే కాకుండా ఇండిపెండెంట్లుగా మరికొందరు పోటీలో నిలబడ్డారు. వీరితో నామినేషన్లను ఎలా ఉపసంహరింపజేయాలన్న దానిపై ముఖ్య అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.రెబల్స్కు, స్వతంత్ర అభ్యర్థులకు తాయిలాల ఆశ చూపేందుకు సిద్ధమయ్యారు. ఇక, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం అభ్యర్థులకు పెద్ద టాస్కా మారింది. ఓటర్లు దేనికి లొంగుతారో, వారిని ఎలా ప్రలోభాలకు గురిచేయా లన్న ఆలోచనలో మునిగిపోయారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మొత్తం 75 గ్రామ పంచాయతీలకు మూడో విడతలో ఎన్నికలు జరగనున్నాయి.వీటిలో మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం వంటి పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఓటరు మహాశయులను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు స్టార్ట్ చేశారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. గెలుపే ధ్యేయంగా ర్యాలీలు తీస్తూ తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో చతుర్ముఖ పోటీ ఉండే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం మండలంలో బీఆర్ఎస్, అబ్దుల్లాపూర్మెట్లో కాంగ్రెస్, మంచాల మండలంలో సీపీఎం, యాచారం మండలంలో బీజేపీ తమ సత్తా చాటాలనుకుంటున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీల సింబల్స్ ఉండనప్పటికీ... రాజకీయ వేడి మాత్రం ఖాయంగా ఉంది. ఆయా పార్టీలకు బలమైన పునాదులున్న గ్రామాల్లో విజయమే లక్ష్యంగా అభ్యర్థులను రంగంలోకి దించారు. ఆరుట్ల, పోల్కంపల్లి, రాయపోల్, తులేకలాన్, తులేఖుర్దు, మేడిపల్లి, నందివనపర్తి, లోయపల్లి, రంగాపూర్, జాపాల వంటి గ్రామాల్లో హోరాహోరీ పోరు ఉండనుంది.కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్, మరికొన్ని గ్రామాల్లో బీజేపీ వర్సెస్ సీపీఎం మధ్య ప్రధాన పోటీ ఉండనుంది. ఇబ్రహీంపట్నం మండలంలో బీఆర్ఎస్, అబ్దుల్లాపూ ర్మెట్లో కాంగ్రెస్, మంచాల మండలంలో సీపీఎం, యాచారం మండలంలో బీజేపీ తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి.సర్పంచ్ ఎన్నికల్లో మహిళలకే ప్రభుత్వం పెద్దపీట వేసింది. దాదాపు మెజార్టీ గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల విషయంలో మహిళలకే ప్రాధాన్యం దక్కింది. అన్ని పార్టీలు ఈసారి సింహభాగం యువతకే టికెట్లు కేటాయించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం వంటి పార్టీలు యువ రక్తానికే

# గుంటూరుపల్లిని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చి దిద్దుతా : గ్రామ సర్పంచ్ సూదిరెడ్డి శ్రీరామ్ చౌదరి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)డిసెంబర్7:


గుంటూరుపల్లిని ఎల్కతుర్తి మండలంలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చి దిద్దుతానని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ సూదిరెడ్డి శ్రీరామ్ చౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరుపల్లి గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే,మంత్రి సహకారంతో గ్రామాన్ని ఎల్కతుర్తి మండలంలోనే ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు.గ్రామ ప్రజలకు త్రాగునీరు,వీధి దీపాలు,విద్యుత్,డ్రైనేజీ మొదలగు ఎలాంటి సమస్యలున్నా ముందుండి పరిష్కారం చేస్తానని తెలిపారు.



# యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా

హైదరాబాద్,డిసెంబర్ 07 (భారత శక్తి):(

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర సరిహ ద్దుల్లో ఉన్న 15 చెక్‌పోస్టులను ఎత్తివేయడంతో అక్రమంగా ధాన్యం రవాణా దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం రాష్ట్ర రైతన్న పాలిట శాపంగా మారుతోంది.



ఇతర రాష్ట్రా ల నుంచి ధాన్యం తరలి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో యథేచ్ఛగా అక్రమ ధాన్యం దందా కొనసాగుతోంది.ఒకటి, రెండుసార్లు అక్రమంగా వస్తున్న వరిధాన్యం లారీలను పట్టుకున్నప్పటికీ.. ముడుపుల బాగోతంతో చాలావరకు చూసీ చూడనట్లుగానే వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ధాన్యం అక్రమ రవాణా అడ్డుకట్టకు సివిల్ సప్లయ్ శాఖ రాష్ట్రంలోని 17 జిల్లాలలో 56 ఇంటర్నల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామని, వాటిలో సీసీ కెమెరాలతో పాటు ఆకస్మిక తనీఖీలుంటాయని చెప్పినా.. ఆచరణ లేదనే విమర్శలు ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో 65.96 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 159.15 లక్ష ల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.ఈ ధాన్యంలో 75 లక్షల టన్నులను ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ ద్వారా సేకరించనున్నట్లు ప్రకటించింది. అందులోనూ 53 లక్షల టన్నులకు ఎఫ్‌సీఐ ద్వారా మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2,389, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 చొప్పున మద్దతు ధరకు కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా మరో రూ.500 బోనస్ రూపంలో అందిస్తుంది.రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట నష్టం వల్ల దిగుబడి తగ్గింది. రాష్ట్రంలోని రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలు తగ్గిపోయాయి. దీంతో తెలంగాణకు చెందిన మిల్లర్లు, వ్యాపారుల కన్ను పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రాలపై పడింది. ఆయా రాష్ట్రాల్లో దళారులను పెట్టుకుని.. వరిధాన్యం కొనుగోలు చేసి.. ఇక్కడికి అక్రమంగా తరలిస్తున్నారు. అయితే ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా ధాన్యం రాకుండా అడ్డుకట్ట వేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. తాజాగా కర్ణాటక, ఏపీ నుంచి ధాన్యం లోడుతో రాష్ట్రానికి వచ్చిన లారీలు పట్టుబడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ వడ్ల రవా ణా అరికట్టేందుకు రాష్ట్రంలోని 17 జిల్లాల్లో 56 ఇంటర్-స్టేట్ చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు చెక్ పోస్టుల్లో సీసీ కెమెరాలతో సర్వేలెన్స్ ఏర్పా టు చేసి, ఆకస్మిక తనిఖీలు చేస్తూ కట్టదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, అగ్రిక ల్చర్, మార్కెటింగ్, కోఆపరేటివ్, పోలీసు శాఖల సమన్వయంతో ధాన్యం సేకరణ ప్ర క్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెబుతున్నారు. అ యితే కర్ణాటక ధాన్యం లారీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ-కర్ణాటక రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతమైన కృష్ణ వాసునగర్ చెక్‌పోస్టు వద్ద ఇటీవలనే అర్ధరాత్రి ఏడు ధాన్యం లారీలు రాగా ఒక లారీనే మాగనూరు పోలీసులు నల్లగట్టు సమీపంలో పట్టుకొన్నారు. దాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. ఆ అధికారులు మరుసటి రోజు వరిధాన్యం లోడును పరిశీలించి, ఎలాంటి చర్యలూ తీసుకోకుండానే కర్ణాటక పంపించారు. రాష్ట్రంలో రావాణాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో 15 చెక్ పోస్టులు ఉండేవి. వాటిని తొలగించడం, సివిల్ సప్లయి అధికారులు సైతం ఏర్పాటు చేశామన్న ఇంటర్ స్టేట్ చెక్ పోస్టుల్లో సిబ్బంది పర్యవేక్షణ లోపించడం, కొన్ని చెక్ పోస్టుల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతోనే కర్ణాటక, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం ధాన్యం వస్తున్నట్లు సమాచారం.సన్నధాన్యానికి ప్రభుత్వం 500 బోనస్ ఇవ్వడంతోనే ఇతర రాష్ట్రాల రైతులు తెలంగాణకు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. నిత్యం చెక్ పోస్టులపై మానిటరింగ్ చేయాల్సిన రాష్ట్ర ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు సైతం చోద్యం కారణంగా యథేచ్ఛగా ధాన్యం తెలంగాణకు వస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సివిల్ సప్లయ్ ఉన్నతాధికారులు స్పందించి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.ఏపీ నుంచి ధాన్యం తెలంగాణకు రాకుం డా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో వాడపల్లి, సాగర్ వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయినప్పటికీ అక్రమ రవాణా ఆగడం లేదు. మిర్యాలగూడ మండలంలోని అలగడప గ్రామ సమీపంలో బుధవారం రాత్రి సమయంలో 11 లారీలను పట్టుకుని పోలీసులు కేసులు నమోదు చేశారు. అదే సమయంలో మరికొన్నింటిని వదిలేశారనే విమర్శలు వస్తు న్నాయి. గత యాసంగిలోనూ వాడపల్లి అం తర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఏపీ నుంచి వచ్చిన 7 ధాన్యం లారీలను సీజ్ చేశారు. ఇప్పుడు మ ళ్లీ వానాకాలంలో పునరావృతమవుతోంది. ఏపీ నుంచి వచ్చిన ఎనిమిది లారీలను ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కట్టుకాసారం రైతులు గత సోమవారం పట్టుకున్నారు. గతేడాది కూడా వందలాది వరిధాన్యం లారీలు ఏపీ నుంచి కట్టుకాసారం మీదుగా తెలంగాణకు వచ్చాయి. పోలీసులు, సంబంధిత అధికారులకు సమాచారం అందించినా పెద్దగా ఫలితం లేకపోవడంతో.. నేరుగా రైతులే రంగంలోకి దిగి ఏపీ లారీలను అడ్డుకున్నారు.డ్రైవర్లు సమాధానం కూడా చెప్పకుండా లారీలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఇప్పటికైనా సివిల్ సప్లయ్ అధికారులు స్పందించి చెక్ పోస్టులను నిత్యం పర్యవేక్షణ చేస్తూ అక్రమంగా ధాన్యం రాకుండా అడ్డుకట్ట వేస్తారా..? లేకుంటే నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తూ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేస్తారా? అనేది చూడాలి మరి!

========================చీచీఅఅ

## బోయిన్ పల్లి మార్కెట్ లో చోరీ




సికింద్రాబాద్.. డిసెంబర్ 07 (భారత శక్తి):

తిరుమలగిరి పిఎస్ పరిధిలోని బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో ఎంబిటీ దుకాణంలో చోరీ జరిగింది. నిన్న అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు దుకాణంలో ప్రవేశించి కౌంటర్ లో ఉన్న 2,30,000 నగదును అపహరించుకుని పరారయ్యారు. శనివారం తెల్లవారుజామున దుకాణానికి వచ్చి చూడగా షట్టర్ తాళాలు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి చూడగా దుకాణంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలికి చేరుకున్న తిరుమలగిరి పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలలో నిందితుల దృశ్యాలు నమోదు కావడంతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.


## కాలువ లో తల్లి మృతదేహం కొట్టుకుపోయిన కొడుకు

పల్నాడు డిసెంబర్ 07 (భారత శక్తి)

రొంపిచర్ల మండలం పాలపాడు వద్దనున్న కాలువ వద్ద తల్లి, ఏడు నెలల కుమారుడు అనుమానాస్పద మృతి చెందారు. తల్లి మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. మృతురాలు నాదెండ్ల కు చెందిన త్రివేణి (25). కుమారుడు శరత్ (7నెలలు) మృతదేహం కాలువలో కొట్టుకుపోయింది. ఏడు నెలల కుమారుడికి అనారోగ్యంగా ఉందని భార్య త్రివేణి తో భర్త శ్రీ కాంత్ కలిసి నరసరావుపేట కు బయలుదేరాడు. నరసరావుపేట మార్గమధ్యలోని కాలువ వద్ద వాహనం అడ్డు రావడంతో ప్రమాదం జరిగినట్టు భర్త శ్రీకాంత్ వెల్లడించాడు.ఘటనలో భార్య త్రివేణి(25) మృతి చెందినట్లు, కుమారుడు శరత్ కాలువలో పడి కొట్టుకుపోయినట్లు పోలీసులకు తెలిపాడు. నరసరావుపేట గ్రామీణ పోలీసులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. భర్త శ్రీకాంత్, భార్య త్రివేణి ల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయని బంధువులు అంటున్నారు. భార్య త్రివేణి, కుమారుడు లను శ్రీకాంత్ హత్య చేసి ప్రమాదం లాగా చిత్రీకరిస్తున్నారని మృతురాలు బంధువుల ఆరోపణ. మృతురాలి శరీరంపై గాయాలు ఉన్నాయని, పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని మృతురాలి బంధువుల డిమాండ్.

## గ్రీన్ సిటీగా రాజధాని అమరావతి

హైదరాబాద్ డిసెంబర్ 07 (భారత శక్తి):



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వప్నమైన ప్రజా రాజధాని అమరావతిని ఆకు పచ్చని నగరంగా తీర్చుదిద్దుతున్నామని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థాసారథి అన్నారు. రాజధానిలో 30 శాతం అధిక ఆక్సిజన్ అందించే చెట్లతో సుందరీకరిస్తున్నామని నిష్ణాతులైన అధికారులను నియమించి రహదార్లు, పార్కులను ఆకర్షణీయమైన చెట్లతో బ్యూటిఫికేషన్ చేస్తున్నామని చెప్పారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సిద్ధార్థా హోటల్ మేనేజ్మెంట్ ప్రాంగణంలో ఫల, పుష్ప ప్రదర్శనలో అమరావతి నగరంలో ఏడీసీ చేపడుతున్న వివిధ గ్రీన్ ప్రాజెక్టులను సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం ఈ ప్రదర్శనలో ఏడీసీ స్టాల్ను ఆమె ప్రారంభించారు. ఇందులో అమరావతిలో నిర్మాణం జరుపుకుంటున్న ప్రభుత్వ భవనాలు, రహదార్ల వ్యవస్థ, పార్కులు, నర్సరీలు, వాగుల వెంబడి చేపడుతున్న సుందరీకరణల ఛాయాచిత్రాలను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. నేటి తరం యువత పచ్చదనం పెంపొందించే అలవాటును చిన్నప్పటి నుంచే అలవరుచుకొని బావి తరాలకు ప్రాణవాయును అందించాలన్నారు. ఈ ప్రదర్శనకు వచ్చే వారికి ప్రధానంగా విద్యార్థులకు రాజధానిలో చేపడుతున్న పచ్చదనం అభివృద్ధి ప్రాజెక్టులను ఏడీసీ ఉద్యానవన అధికారులు క్షేత్రస్థాయిలో వివరిస్తానని పేర్కొన్నారు.

ఈ ప్రదర్శనలో ఏడీసీ ఉద్యానవన విభాగం ఉప సంచాలకులు బి.శ్రీనివాసులు, జి.ఆండాళ్, సహాయ సంచాలకులు డి.నవీన్కుమార్, కె.స్వాతి, హార్టికల్చ ఆఫీసర్ ఎన్.కిషోర్కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్లు గ్రామ ఉజ్వల భవిష్యత్తుకై ఉత్తమ అభ్యర్థులను సర్పంచ్ గా ఎన్నుకోవాలి

**గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు అని నినదించిన మహాత్మా గాంధీ నినాదం సాకారం కావాలంటే గ్రామీణాభివృద్ధి జరగాలి. దేశాభివృద్ధి**

గ్రామాల అభివృద్ధి పై ఆధారపడి ఉంటుంది. గ్రామాభివృద్ధి అనేది ఆ



ఊరి ప్రజలు ఎన్నుకునే సర్పంచ్ నాయకత్వ దక్షత మీద ఎన్నుకునే ఓటర్ల విజ్ఞతపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఓటు మాత్రమేకాదు అది మన తలరాతనుమార్చే సాధనం.

గ్రామ ప్రజలభవిష్యత్తును పిల్లల భవిష్యత్తు నిర్ధారించే ఒక వజ్రాయుధం. ఎన్నికల్లో డబ్బు ఉచిత ప్రలోభాలు మద్యం కులం బంధువుల వ్యామోహం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మాయమాటల వ్యామోహంలో పడి ఓటర్లు తప్పుడు వ్యక్తిని ఎన్నుకుంటున్నారు. ఫలితంగా గ్రామాలు అభివృద్ధి చెందడం లేదు. ఓటరు తమ ఓటును అభివృద్ధి వైపే వేయాలి అనేధి నినాదానికే పరిమితం చేయకుండా అభివృద్ధికి పాటుపడే అభ్యర్థికేఓటువెయ్యాలి. పల్లె ప్రగతిని కాంక్షించే వారిని సర్పంచ్ గాఎన్నుకోవాలి.

గ్రామ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే ఉత్తమ అభ్యర్థిని సర్పంచ్ గా ఎన్నుకోవాలి.

తెలంగాణ రాష్ట్రంలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థుల నేర చరిత్ర' ప్రజాసేవలో వారు చేసిన గణనీయమైన సేవలు ప్రజలతో వారికి వున్న ప్రజా సంబంధాలు' ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో వుండి గ్రామంలో భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను పెంపొందించే శక్తిసామర్థ్యాలు కలిగి గ్రామ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటు పడే ఉత్తమ అభ్యర్థులను విజ్ఞత గల ఓటర్లు తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలి.

గ్రామ సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలి

ఆపదలోనే ఉన్నాను అని భరోసా ఇచ్చే నాయకత్వం కావాలి. ఊరిలో ప్రజారోగ్యం క్షీణించి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు భరోసానిచ్చి ముందు నిలబడే నిజమైన నాయకుడు కావాలి. గెలిచిన తర్వాత కనపడకుండా పోయేవాడు కాదు. కష్ట కాలంలో ప్రజల మధ్య ఉండేవాడు మనకు కావాలి .అందుబాటులో ఉండే వ్యక్తిని సర్పంచిగా ఎన్నుకోవాలి. సర్పంచ్ ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించాలి. సామాన్యులకు అందుబాటులోఉండాలి .నిజాయితీగా సేవా దృక్పథం కలిగిన వ్యక్తిని సర్పంచ్ గా ఎన్నుకోవాలి.ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టి గెలిచేవాడు ఆ డబ్బును సంపాదించడం మీద దృష్టి పెడతాడు నిధులను దుర్వినియోగం చేస్తాడు .అవినీతి పాలనకు తెరతీస్తాడు. ప్రజల అభిమానాన్ని నమ్ముకుని సేవ చేయాలనే తపన ఉన్న వ్యక్తిని ఎన్నుకుంటే గ్రామంలో అభివృద్ధి జరుగుతుంది .అవినీతి లేని నిజాయితీగా పరుణ్ణి ఎన్నుకుంటే ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు యొక్క లాభాలు ప్రత్యక్షంగా ప్రజలకు చేరుతాయి. సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థి గ్రామంలో విద్యా వైద్య ఆరోగ్య వాతావరణ పర్యావరణ రంగాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తాడో? ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల అమలుకు నిధులను ఏ విధంగా సమీకరిస్తాడో బహిరంగంగా ప్రకటించాలి.

గ్రామ పరిస్థితులపై అవగాహన ఉన్న వ్యక్తిని సర్పంచిగా ఎన్నుకోవాలి. గ్రామంలోలభించే భౌతిక వనరులు' సహజ వనరులు 'భౌగోళిక స్థితి గతుల మీధ అవగాహన వున్న విద్యావంతున్ని మేధావిని గుర్తించి ఓటువేయ్యాలి. స్థానికంగాప్రజలకు అందుబాటులో వుండి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి గ్రామ ప్రజల అభివృద్ధికి పాటుపడే అభ్యర్థులను సర్పంచ్ గా ఓటర్లు ఎన్నుకోవాలి.

ప్రలోభాలు వద్దు నిజాయితీ ముద్దు

గ్రామంలోని ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నోటుకు ఓటు అమ్ముకోవద్ధు. ఎన్నికల సమయంలో ఇచ్చే 5వేల రూపాయలకు ఆశపడి భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దు. నాయకుడు ఎన్నికల్లోకోట్లు ఖర్చు చేసి గెలిచిన తర్వాత అంతకుమించి సంపాదిస్తాడు. ప్రజలను దోపిడి చేస్తాడు. ప్రజలకు సేవ చేయాలనే స్పృహ నేటి నాయకుల్లో లేదు. ఈరోజు డబ్బు తీసుకొని మనం ఓటు వేస్తే రేపు మన ఊరికి కావాల్సిన మౌలిక వసతులు రోడ్లు విద్య ఆరోగ్యం సదుపాయాలు రావు. నోటుకు ఓటు భవిష్యత్తుకు ముప్పుగా పరిణమిస్తుంది.

ప్రజా సేవకులను సర్పంచ్ గా ఎన్నుకోవాలి.ఓటర్లుఎలాంటి ఒత్తిడికి భయానికి తలవంచకుండ హేతుబద్ధంగా వ్యవహరించాలి. ప్రజలకు సేవ చేస్తున్న వారిని నిజంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థికి ఓటు వెయ్యాలి. సెంటిమెంట్ పై ఓటు వేయరాదు.

సర్పంచ్ అభ్యర్థి మనకులం మన మతం' మన బంధువు మా అన్న మా తమ్ముడు మా బావ మా వదిన అనే సెంటిమెంట్లతో ఓటు వేయడం అభివృద్ధికి అవరోధం. నాయకుడు సమర్ధుడా? కాదా ?ప్రజా సమస్యలు పై అవగాహన ఉందా? లేదా ?అని ఆలోచించాలి కేవలం కులం మతం బంధుత్వం ప్రాతిపదికన ఓటు వేస్తే గెలిచిన నాయకుడు తన కులానికి తన వర్గానికి మేలు చేస్తాడు .ఊరికి న్యాయం చేయలేడు.

గ్రామ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే వారిని ఎన్నుకోవాలి.అభివృద్ధికి కులం లేదు. ఆకలికి మతం లేదు. రోడ్లు తాగు నీరు బడి మౌలిక వసతులు' పర్యావరణం ప్రజలందరికీ కావాలి. సంకుచిత భావాలనుండి ఓటరు బయటపడి గ్రామ సమగ్రాభివృద్ధి కొరకు పాటుపడే సామర్థ్యం నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తిని సర్పంచ్ గా ఎన్నుకుంటేనే గ్రామీణుల జీవితాలలో వెలుగులు వస్తాయి. గ్రామ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రగతి పురోగతి కోసం మనస్ఫూర్తిగా పని చేస్తాడనే నమ్మకమున్న అభ్యర్థికి ఓటు వేసి సర్పంచిగా ఎన్నుకోవాలి. నిజాయితీ సామాజిక సేవబి ఎన్నికకు గీటురాయి.నిజాయితీ గల అభ్యర్థికి ఓటు వెయ్యాలి. ఒక అభ్యర్థిని ఎన్నుకునేటపుడు అభ్యర్థి ఎంత సామాజిక సేవ చేశాడన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. సామాజిక సేవా పాలనా దక్షత ప్రజా సంబంధాలు నిబద్ధత నీతి నిజాయితీ అభ్యర్థి ఎన్నికకు గీటు రాయి కావాలి.ఓటర్లు మద్యానికి మందుకు బీరు బిర్యాని ముక్క చుక్కకు బానిసలై అవినీతి పరులను ఎన్నుకోవద్దు. అసమర్థులను అవినీతి పరులను ఓటుతో వేటు వెయ్యాలి . ఓటు ద్వారా వారిని బహిష్క రించాలి.ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి. ఓటర్లు గాఢ నిద్ర మానుకొని ఉత్తమఅభ్యర్థులనుఎన్నుకోవాలి.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో సర్పంచ్ గా బాధ్యతలను నిర్వహించే సామర్థ్యం వున్న వారిని గుర్తించాలి . విద్యావంతులైన అభ్యర్థి మెరుగైన నిర్ణయాలు తీసుకోగలడని సాధారణ ఓటరు అర్థం చేసుకోవాలి. సర్పంచ్అభ్యర్థి కి గ్రామ స్థితి గతులు పరిస్థితుల మీద మేధస్సుతో కూడిన దూర దృష్టితో కూడిన అభివృద్ధి దృక్పథం కలిగి వుండాలి.నేర రికార్డులు ఉన్న అభ్యర్థిని బహిష్కరించాలి. ఉచితాలకు స్వస్తి పలకాలి. ఉచితాలు ప్రకటించి ఓటర్లను ఆకర్షించేందుకు చేసే చర్యలు చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించి అభ్యర్థి పైన ఎన్నిక కమిషన్ చర్యలుతీసుకోవాలి.గ్రామ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన. అభ్యర్థికి గ్రామ సామాజిక ఆర్థిక చారిత్రిక సాంస్కృతిక అంశాల పై అవగాహన వుండాలి.

సర్పంచ్అభ్యర్థులకి గ్రామ సరిహద్దులు తెలిసివుండాలి.భూమి వినియోగం నేలల తీరు వ్యవసాయ రంగంలో పంటల తీరు మార్కెటింగ్ 'స్టోరేజ్ సౌకర్యాలు 'ఉత్పత్తి ఉత్పాదకత చిన్న ' కుటీర లఘు ' భారీ పరిశ్రమలు పెట్టుబడి వాటి నిర్వహణ పనితీరు ఉపాధి సృష్టి ఆదాయ సృష్టి 'అటవీ సంరక్షణ 'పర్యావరణ

ప్రకృతి విపత్తులు చట్టాల పట్ల అవగాహన పరిజ్ఞానం

మహిళా ' యువజన' ఎస్సి ఎ'స్టీ 'బి'సి సాధికారిత సంక్షేమం అభివృద్ధి పథకాలు చట్టాల అమలు.విద్యుత్ శక్తి జలవనరుల ప్రాజెక్టుల నిర్మాణం నాణ్యత పట్ల అవగాహన పరిజ్ఞానం కలిగిన అభ్యర్థికి ఓటర్లు తమ ఓటు హక్కుతో మద్దత్తు ప్రకటించాలి.

గ్రామాభివృద్ధిపై విజన్ ఉండాలి.

సర్పంచ్ గా పోటీ చేసే అభ్యర్థికి గ్రామాభివృద్ధిపై స్పష్టమైన విజన్ ఉండాలి.

గ్రామంలోని ప్రజల జీవన విధానం విధ్య' వైద్య రావణా 'కరంట్ ' డ్రైనేజ్ మౌలిక వసతుల కల్పనకు

సామాజిక అవస్థాపన పెట్టుబడులు 'మూలధన వనరుల సమీకరణ వనరుల అభిలషణీయ వినియోగం పట్లనిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేసిన విశ్వసనీయ అభ్యర్థులకు విజ్ఞత గల ఓటర్లు ఓటు వెయ్యాలి.

చట్టాలపై అవగాహన ఉండాలి.

సర్పంచ్ గా పోటీ చేసే అభ్యర్థికి రాజ్యాంగం పట్ల అవగాహన స్థానిక సంస్థల చట్టాల మీద పరిజ్ఞానం కలిగిన అభ్యర్థికి ఓటు వెయ్యాలి. భూమి రెవెన్యూ చట్టాలు అటవీ చట్టాలు పారిశ్రామిక చట్టాలు మహిళా యువత ఎస్సి' ఎస్టీ 'బీసీ మైనార్టీలు హక్కుల రక్షణ భద్రత సంక్షేమ పథకాలు ప్రాజెక్టుల అమలు కొరకు వున్న చట్టాల పట్ల అభ్యర్థులు అవగాహన పరిజ్ఞానం కలిగి వుండాలి.

ప్రగతి సమీక్ష సమావేశాలు నిర్వహించాలి.

మేనిఫెస్టో లో పేర్కొన్న అంశాల అమలు మీద సమీక్ష సమావేశాలునిర్వహించాలి. ఎన్నికైన సర్పంచులు ప్రతి 3 నెలలకు ఒక సారి గ్రామ సభ విధిగా నిర్వహించాలి.

ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న అంశాల అమలు పట్ల సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రగతి సంక్షేమ పథకాల అమలులో ప్రజలను భాగస్వాములను చెయ్యాలి.

గ్రామం లోని ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే పన్నులు గ్రామ అభివృద్ధికి కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు వాటి వినియోగం మీధ ప్రజలు పౌర సమాజంతో సమావేశాలు నిర్వహించాలి.

ప్రజల వద్దకు పాలనను అందించాలి.

ఎన్నికైన సర్పంచులు గ్రామపంచాయితో కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి.

ప్రజల పిర్యాదులను సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల ద్వారా వారం రోజుల్లో పరిష్కారమయ్యే పాలన విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామ పంచాయతీ సిబ్బందిలో అధికారులలోజవాబుదారీతనం

పారదర్శనికతకు సుపరిపాలనకు చర్యలు చేపట్టాలి.

ప్రజల వద్దకు పాలనను చేర్చే చర్యలు చేపట్టాలి.ఓటర్ల అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి రక్షరాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవలిసిన బాధ్యత ఓటర్ల పై వుంది. ఓటర్లు అప్రమత్తంగా వుండి అర్హులైన అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి. అభ్యర్థుల హామీలను పరిశీలించి వారి పని తీరును పరిశీలించాలి.గ్రామ భవిష్యత్తు విజ్ఞత గల ఓటర్ల చేతుల్లోనే ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు. డ్రగ్స్ 'అవినీతి భూ మాఫీయా ' ఇసుక మాఫియా ' పేదరికం నిరుద్యోగం సామాజిక' ఆర్థిక అసమానతలు 'లింగ వివక్ష లైంగిక వేదింపులు 'సామాజిక హింస బాలకార్మికులు నిర్మూలన వెట్టిచాకిరి యువత విద్యార్థుల రైతుల ఆత్మహత్యలు మొన్నగు సమస్యలను తుడిచి పెట్టే సామర్థ్యం వున్న విద్యావంతులు

నిజాయితీ గల అభ్యర్తులను ఓటర్లు ఎన్నుకోవాలి.

ప్రగతిశీల గ్రామం బిఓటర్ల ప్రతిజ్ఞ

గ్రామాన్ని ప్రగతి శీల గ్రామంగా ప్రజాస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేసే అభ్యర్థిని సర్పంచిగా ఎన్నుకుంటామని ఓటర్లుగా ప్రతిజ్ఞ చేద్దాం. సకల జనుల సంక్షేమానికి గ్రామ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఓటేద్ధాం. ఓటుతో ప్రజలజీవితాల్లో వెలుగులు తెద్దాం.మహాత్మ గాంధీ భావించిన గ్రామీణ స్వరాజ్యాన్ని స్థాపిద్దాం

నేదునూరి కనకయ్య రాష్ట్ర అధ్యక్షులుతెలంగాణ ఎకనమిక్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక కరీంనగర్ 9440245771

# చెవులపై పూలతలు ఎంతందమో!

ఎంత ఖరీదైన దుస్తులు, నగలు ధరించినా... చెవులకు కమ్మలు లేకపోతే మాత్రం నిండుదనం రాదు. బుట్టలు, దిద్దులు, కమ్మలు, లోలాకులు... ఇలా ఎన్నెన్నో డిజైన్లు ఎప్పటికప్పుడు అలరిస్తూనే ఉన్నాయి. వాటిల్లో కొన్నాళ్లుగా యువతను మెప్పిస్తోన్న ఇయర్‌కఫ్స్ సందడీ తక్కువేం కాదు. చెవి మొత్తాన్నీ కప్పి ఉంచేలా సింగారించుకునే స్టైల్ నిన్నటిది. రొటీన్‌కి భిన్నంగా, ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకునే ఈతరం ఇందులోనూ మినిమలిజాన్ని వెతుకుతోంది. ఆధునిక డిజైన్ల స్థానంలో సంప్రదాయ సొగసులు అద్దుకోవాలనుకుంటోంది. దానికి తగ్గట్లే డిజైనర్లూ సింపుల్‌గా, స్టైలిష్‌గా వీటిని తీర్చిదిద్దేశారు. స్టేట్‌మెంట్ లుక్‌ని తెచ్చిపెట్టడానికి రాళ్లు, కుందన్లు, ముత్యాలు, పచ్చలు... ఒకటేమిటి అన్నింటినీ అందంగా అమర్చేస్తున్నారు. చెవి అంచుల్లో చేరి లతల్లా అల్లుకుపోతున్న ఇవి అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి. వాటినోసారి మీరూ చూడండి.







# మురిపిస్తున్న రెట్రో అందాలు..!



నేటితరం నాయికలు ట్రెండ్ల వెనకాలే పరుగెత్తట్లేదు. ఒకప్పటి కట్టూ, బొట్టుకీ ఓటేస్తున్నారు. అలనాటి తారల చీరకట్టు, కొప్పులను రీక్రియేట్ చేస్తూ రెట్రో లుక్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తాజాగా నటి కీర్తి సురేశ్ తన కొత్త సినిమా ప్రమోషన్‌లో భాగంగా 90ల్లో నటీమణులు ధరించిన పోల్కా డాట్ హెడ్ స్కార్ఫ్‌ను ధరించింది. ఆ వింటేజ్ లుక్ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. అవి అమ్మాయిలను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఈమె కన్నా ముందే... దీపికా పదుకొణ్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెట్రో లుక్‌తో తలకు హెడ్‌బ్యాండ్ ధరించి, రెడ్ కార్పెట్‌పై హొయలొలికించింది. ఇంకేం ఈ హెడ్ బ్యాండ్లు, స్కార్ఫ్‌ల మీద అమ్మాయిలు మనసు పారేసుకుంటున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు, వీడ్కోలు పార్టీలు, ఫ్యాషన్ వాక్‌ల్లో వీటిని ధరించి రెట్రో లుక్‌లో మెరిసిపోతున్నారు. యువత మదిని దోచేస్తున్న ఈ హెడ్ బ్యాండ్ల వెనక చాలా పెద్ద చరిత్రే ఉంది. ఇవి గ్రీకు కాలం నాటివట. వారి తర్వాత రోమన్లు, ఆ తర్వాత రాణులు వీటిని ధరించేవారట. అప్పటి పెళ్లిళ్లలో తలకి ప్రత్యేక ఆభరణంగా వీటినే పెట్టుకునేవారట. ఆపాత మధురాల్ని ఒక్కొక్కటిగా ప్రయత్నిస్తున్న జెన్ జీలు ఈ రెట్రో లుక్‌తోనూ ప్రేమలో పడుతున్నారు. సందర్భానుసారంగా ఈ హెడ్‌బ్యాండ్‌లను ధరించి ఫొటోలకు పోజులిస్తున్నారు. ఫ్యాషన్ ట్రెండ్లు ఎప్పటికప్పుడు మారొచ్చు కానీ, 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అంటూ ఈ క్లాసిక్ లుక్‌కే ఓటేస్తున్నారు. ఆధునిక దుస్తులకీ రెట్రో హంగులు అద్దుతూ మురిపిస్తున్నారు. బెల్ బాటమ్, క్రాప్ టాప్, హై వెయిస్ట్ డెనిమ్ షార్ట్స్ కి నప్పేలా... ఫ్లోరల్, వెల్వెట్, శాటిన్ క్లాత్‌లతో వీటిని తయారు చేయించుకుంటున్నారు. ఈ లుక్ మీకూ నచ్చిందా? అయితే ఇందులో మీ ఓటు దేనికి...

# కెనడా టొరంటోలో దర్‌హమ్ తెలుగు క్లబ్ (డి.టి.సి) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడిన డి.టి.సి ఫ్యామిలీ ఫెస్ట్ 2025









(కెనడా నుండి ప్రత్యేక ప్రతినిధి, డిసెంబర్ 2025)

కెనడాలోని దర్‌హమ్ తెలుగు క్లబ్ (డీటీసీ) ఆధ్వర్యంలో, కార్తీక మాసపు వనభోజన కాన్సెప్ట్‌తో "డి.టి.సి ఫ్యామిలీ ఫెస్ట్ 2025:" వేడుకలు టొరంటోలోని మ్యాక్స్‌వెల్ హైట్స్ సెకండరీ స్కూల్, ఓషావా ఆడిటోరియంలో అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి సుమారు 800కి పైగా తెలుగు కుటుంబాలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నాయి.కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా అపర్ణ రంభోట్ల సంతోష్ కుంద్రు, అలాగే యువ వ్యాఖ్యాతలుగా ఆశ్రిత పోన్నపల్లి, శిరి వంశికా చిలువేరు, శ్రేయస్ ఫణి పెండ్యాల వ్యవహరించారు.

డి.టి.సి ఎగ్జిక్యూటివ్ కమిటీసభ్యులు నరసింహారెడ్డి గుత్తిరెడ్డి, రవి మేకల, వెంకటేశ్వర్ చిలువేరు, రమేష్ ఉప్పలపాటి, శ్రీకాంత్ సింగి శెట్టి, గుణశేఖర్ కోనపల్లి, యుగంధర్ చెరుకురి, గౌతమ్ పిడపర్తి, వసుదేవకుమార్ మల్లుల, కమల్ మూర్తి, సర్దార్ ఖాన్ చెరుకు పాలెం, శివరామ్ మోహన్ వసువులేటి గార్ల చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన జరిగింది. తరువాత కెనడా జాతీయ గీతం మరియు మా తెలుగు తల్లి గీతంతో కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.

తదుపరి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అన్ని వయసుల పిల్లలు, కళాకారులు అద్భుతమైన నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ వేడుకలో డి.టి.సి కుకింగ్ షో మరియు డి.టి.సి కిడ్స్ ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. విజేతలు మరియు పాల్గొన్న వారికి %గాుఎఝుఅషెవు రాష్ట్రఎంఅశీ% వారి బహుమతులు గ్రాండ్ స్పాన్సర్‌గా తూసి వినయగమూర్తి అందజేశారు.

డి.టి.సి కల్చరల్ డైరెక్టర్ వెంకటేశ్వర్ చిలువేరు గారు మాట్లాడుతూ, మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంలో ఇలాంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. కెనడాలో నివసిస్తున్న తెలుగు సమాజం చూపుతున్న ఐక్యత, సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మన భారత సాహితి, సంపద ఉత్సవాలను కెనడా లో ఘనంగా జరపడం మన అదృష్టం గా భావిస్తున్నానని డైరెక్టర్ వెంకటేశ్వర్ చిలువేరు గారు గుర్తు చేసారు

ఈ వేడుకలకు విశిష్ట అతిథులుగా డా. బాబీ యానగావా గారు (ఎం.డి, పీహెచ్.డి, ఎఫ్.ఆర్.సి.ఎస్.సి), డివిజన్ హెడ్ %–% కార్డియాక్ సర్జరీ, సెయింట్ మైకేల్ హాస్పిటల్ విచ్చేశారు. ఆయన కార్డియో ఆరోగ్యం మరియు కుటుంబ ఆరోగ్యంపై విలువైన సూచనలు అందించి దర్‌హమ్ తెలుగు క్లబ్ (డి.టి.సి) కుటుంబ సభ్యులకు మరింత ఆరోగ్య సంరక్షణ గురించి అందరికీ ఉపయోగపడే విషయాలను చక్కగా వివరించారు.

ఈ సందర్భంగా డీ.టి.సి ఎక్సలెన్సీ అవార్డులు అందజేయబడ్డాయి. డా. బాబీ, డా. శరత్ గుండల, డా. శ్రీవాణి గుండల గారి చేతుల మీదుగా డి.టి.సి కమ్యూనిటీ సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డు –శ్రీమతి ఉషా నడుటి గారికి, డి.టి.సి ఆర్ట్స్ మ్యూజిక్ & క్లాసికల్ డాన్స్ ఎక్సలెన్సీ అవార్డు– చిన్నారి సిరి వంశిక చిలువేరు కి, డి.టి.సి ఆర్ట్స్ & సింగింగ్ ఎక్సలెన్సీ అవార్డు – చిన్నారి శ్రేయస్ ఫణి పెండ్యాలకి, అందజేసారు. ముగ్గురు అవార్డు గ్రహీతలకు DTC తరపున సత్కారం చేసి, వారి ప్రతిభను అభినందించారు.

కార్యక్రమ విజయానికి చేయూతనిచ్చిన ప్రాయోజకులను %ఙుజ% సంస్థ శాలువాలతో సత్కరించింది. ఈ సందర్భంగా గ్రాండ్ స్పాన్సర్‌గా తూసి వినయగమూర్తి, ఫుడ్ స్పాన్సర్స్‌గా సింప్లీ సౌత్ రెస్టారెంట్ – ఓషావా (రామ్ & సస్య పెడ్డి) గార్లు సహకరించారు. సిల్వర్ స్పాన్సర్స్‌గా రామ్ జిన్నాల, గెట్ హోమ్ రియాల్టీ (రమేష్ గోలు, ఆనంద పెరిచెర్ల), రఘు జులూరి, భారత్ లా గార్లు మద్దతు అందించారు.అలాగే సపోర్టింగ్ స్పాన్సర్స్‌గా అడ్వాన్స్ ఫిజియో (గౌతమ్ పిడపర్తి), డా. శరత్ గుండల, డా. పద్మజరాణి కొంగరా,

డా. సౌజన్య కసులా, దేశీ కార్ట్ గ్రోసరీస్ (రాజశేఖర్), సివమ్మ టిఫిన్స్, బండీ మేడ బజ్జి (శ్రవంతి), నమస్తే ఇండియా సూపర్ మార్కెట్ – ఏజాక్స్ (యోగేశ్ జీ), షోబి డెకోర్స్,

పవన్ వీ.కె ఫోటోగ్రఫీ వంటి ప్రాయోజకులు ఈ కార్యక్రమానికి విలువైన సహకారం అందించారు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా గ్రేటర్ టొరాంటో ఏరియా(జీ.టీ.ఏ) లోని పలు తెలుగు సంఘాల ప్రతినిధులను దర్‌హమ్ తెలుగు క్లబ్ వారు ఆహ్వానించి వారిని సత్కరించారు. ఈ సందర్భంలో DTC ప్రెసిడెంట్ శ్రీ నరసింహారెడ్డి గుత్తిరెడ్డి మాట్లాడుతూ: "తెలుగు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించే దిశగా, గ్రేటర్ టొరాంటో ఏరియా(జీ.టీ.ఏ) లోని అన్ని సంస్థలు పనిచేస్తున్నాయి అని పేర్కొన్నారు. అంతేకాక, దర్‌హమ్ తెలుగు క్లబ్ (డి.టి.సి) సమాజ కార్యక్రమాలు, వినూత్న ప్రోగ్రామ్స్, ఎక్సలెన్సీ అవార్డులు, సహకార కార్యక్రమాల విజయానికి ప్రాయోజకులు అందిస్తున్న మద్దతుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి వారి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అలాగే, దర్‌హమ్ తెలుగు అసోసియేషన్ (డీ.టి.ఏ) నుండి శ్రీమతి స్వాతి మీర్యాల గారు, ఒంటారియో తెలుగు ఫౌండేషన్ (ఓ.టి.ఎఫ్) నుండి శ్రీ ప్రవీణ్ నీలా గారు, బర్చ్‌మౌంట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (బి.ఎఫ్.సి) నుండి – జగపతి రాయల శ్రీ సూర్య కొండేటి, టొరంటో తెలుగు కమ్యూనిటీ (టి.టి.సి) నుండి – శ్రీ విజయ కుమార్ కోట గారు, క్లారింగ్టన్ హిందూ అసోసియేషన్ మరియు దర్‌హమ్ హైదరాబాదీ అసోసియేషన్ నుండి వారి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని, దర్‌హమ్ తెలుగు క్లబ్ వారు తెలుగు సమాజానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు.

డి.టి.సి ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమంలో తెలుగింటి భోజనం, తినుబండారాలు, తేనీరు విందును సింప్లీ సౌత్ %–% ఒషావా సౌజన్యంతో అందించారు. అలాగే, దర్‌హమ్ తెలుగు క్లబ్ (డి.టి.సి) వారు 20 కిపైగా బహుమతులతో రాఫెల్ డ్రా విజయవంతంగా నిర్వహించారు.

డీటీసీ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి గారు మాట్లాడుతూ – ఏ దేశమేగినా ఎందుకాలిడిన ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా పొగడరా నీతల్లి భూమి భారతిని నిలుపరా నీ జాతి నిండు గౌరవము అన్న భావంతో, తెలుగు సంస్కృతి, ఐక్యత, ఆనందాలతో నిండిన డి.టి.సి ఫ్యామిలీ ఫెస్ట్ 2025 కార్యక్రమం కెనడా టొరంటోలో ఘనంగా విజయం సాధించింది. చివరగా డి.టి.సి కల్చరల్ డైరెక్టర్ వెంకటేశ్వర్ చిలువేరు గారు డి.టి.సి కార్యకర్తలు, స్పాన్సర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు, వందన సమర్పణలు తెలుపుతూ కార్యక్రమాన్ని ముగించారు.

# మాజీ ఎమ్మెల్యే విజయమ్మను సన్మానించిన బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజా నాగేంద్ర

పోరుమామిళ్ళ, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 07:మార్కెట్ యార్డ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని దిగ్విజయం చేసిన బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రితేష్ రెడ్డి బద్వేల్ మాజీ శాసనసభ సభ్యురాలు కే విజయమ్మ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

మన నియోజకవర్గ రైతులకు ఉపయోగకరంగా పనిచేయవలెనని దానికి మీకు ఎలాంటి సహాయ సహకారాలు అయినా నేను అందిస్తానని ఆమె తెలియజేశారు. పోరుమామిళ్ల ఉప మార్కెట్ గురించి కూడా చర్చించడం జరిగింది. ఏఎంసీ చైర్మన్ సుప్రజా నాగేంద్ర మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ ద్వారా నియోజకవర్గ రైతులకు సహాయపడడానికి నా శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ఆమె తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల బిజెపి మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర. అసెంబ్లీ కో కన్వీనర్ పల్లెం శెట్టి పండరి, మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, రాష్ట్ర ఓబిసి



నాయకులు నారోజు రమణాచారి, ఏఎంసి డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# 69వ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి విజయవంతం

పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 07:

పోరుమామిళ్ల మండలం అంబేద్కర్ సర్కిల్ నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు కొమ్ముతోటి పౌలు, రాష్ట్ర ప్రచార ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద్ రావు, బద్వేల్ నియోజకవర్గం శాసనసభ్యురాలు డాక్టర్ సుధమ్మ, రంగసముద్రం సర్పంచ్ రవి ప్రకాశ్ రెడ్డి, బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షులు అలివేర్,అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఉపాధ్యక్షులు మల్లికార్జున, యూత్ అధ్యక్షులు చిన్న,పోరుమామిళ్ల ఎంపీపీ సి భాష, మాజీ వైసీపీ రాజశేఖర్, జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, మాల మహానాడు మండల కార్యదర్శి ప్రవీణ్,సిపిఎం భైరవ ప్రసాద్, వారి సిబ్బంది,రాష్ట్ర యూత్ కన్వీనర్ భాష, ప్రజా సంఘ నాయకులు, ఆయా దళిత నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ పోరుమామిళ్ల పట్నంలో అంబేద్కర్ వర్ధంతి ఇంత ఘనంగా జరుగుతుంది అంటే ఇందులో కడప జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతులు గాంచిన పోరుమామిళ్లలో అంబేద్కర్ వర్ధంతి జరపడం చాలా గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర ప్రచార ప్రధాన కార్యదర్శి కి ఎన్నో విధాలుగా కృతజ్ఞులే ఉంటామని, రాబోయే ఏప్రిల్ 14 వ తారీకు అంబేద్కర్ జయంతికి అన్ని సంఘాలతో కలిపి భారీగా ఆయన జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అన్ని సంఘాలతో కలిపి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ తో కలసి సదనంగా అందరం కలిసి ఉంటామని అందరు సమానులే, భారత రాజ్యాంగంలో ఉన్నటువంటి రాజ్యాంగనిబట్టి అనుసరించిన ప్రతి ఒక్కరికి నమస్కరిస్తూ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సమితి కమిటీ సభ్యులు నాగ దాసరి శేఖర్,బి కోడూర్ మండల అధ్యక్షులు చాటకొండ శీను, కృపానందం దళిత సీనియర్ నాయకులు ముత్యాల చన్ రాయుడు, అన్ని వేళల్లో ఆదుకునే మహానుభావులు ఎంతో మంది పాల్గొని విజయవంతం చేశారు.

# తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా నరాల సత్యనారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 07(భారత శక్తి ):

తెలంగాణ పొలిటికల్ జేఏసీ ని హైదరాబాదులో ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ పొలిటికల్ జేఏసీ ప్రజా సమస్యలపై రాజీలేనిపోరాటం చేస్తుంది. ప్రజలే మా ధైర్యం, ప్రజల కోసమే మా పోరాటం అనే నినాదంతో ఏర్పడినదే తెలంగాణ పొలిటికల్ జేఏసీ వైస్ చైర్మన్ గా ధారావత్ గణేష్ నాయక్, వట్టం ఉపేందర్, అంగోతు రాంబాబు, సెక్రటరీ జనరల్ గా బత్తుల సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా బానోతు. హుస్సేన్ నాయక్, పూనెం శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా తోడేటి శంకర్ గౌడ్, అనంతుల మధు, రాష్ట్ర కార్యదర్శులుగా తుల్జా రెడ్డి, పాలకుర్తి కృష్ణ, సంగిశెట్టి క్రిస్టా ఫర్, మహిళా కార్యదర్శిలుగా కంచర్ల మంజూష, కందుకూరి శ్వేత, సింగరాజు శ్యామల, రాష్ట్ర కమిటీ సభ్యులుగా మాలోతు రామన్న నాయక్, తునికి పాటి చారి, ఇస్లావత్ సంతోష్ నాయక్, కుక్క సత్యం గౌడ్ ను నియమించినట్లు తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ తెలియజేశారు. తెలంగాణ పొలిటికల్ జేఏసీ రెండు తీర్మానాలు చేయడం జరిగింది.

తెలంగాణ ఉద్యమకారుల కోసం రెండు వేల మందితో ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయాలని తీర్మానం చేయడం జరిగింది.



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని 3500 మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయాలని తీర్మానించడం జరిగినది అని తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ తెలియజేశారు.

# ఫిబ్రవరి మొదటి వారం నుండి టిఆర్ఎస్ ( డి )ప్రజా చైతన్య పాదయాత్ర: టిఆర్ఎస్ ( డి) రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 7(భారత శక్తి ):తెలంగాణలో టిఆర్ఎస్ (డి) ప్రజా చైతన్య పాదయాత్రను ఫిబ్రవరి మొదటి వారం నుండి ప్రారంభిస్తున్నామని పాల్వంచలోని అయ్యప్ప నగర్ లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు.తెలంగాణలో ఉద్యమకారుల సమస్యలు తెలుసుకోవడానికి, అమరులైన 1300 మంది కుటుంబాలను నేరుగా కలుసుకొని ఆ కుటుంబ కష్టనష్టాలను తెలుసుకోవడానికి, నష్టపోయిన తెలంగాణ రైతాంగం యొక్క బాధలను తెలుసుకోవడానికి, సంక్షేమము లేక బాధపడుతున్న మహిళలను నేరుగా కలుసుకుంటూ , పెన్షన్ సరిగా అందక బాధపడుతున్న వృద్ధులను, వికలాంగులను, వితంతువులను కలుస్తూ సామాజిక తెలంగాణ ముఖ్య ఉద్దేశంగా, బహుజనవాదాన్ని బలపరిచే విధంగా టిఆర్ఎస్ (డి) ప్రజా చైతన్య పాదయాత్ర ముందుకు కొనసాగుతుందని టిఆర్ఎస్ ( డి) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు. అదేవిధంగా మొన్న జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ తెలంగాణ 31 జిల్లాల నుండి తన కేడర్ను మొత్తం సమీకరించుకొని పోరాటం చేశాయి. పెద్దగా అనుకున్నంత ఫలితాలు సాధించలేకపోయాయి. నాలుగు లక్షల ఓటర్లు ఉంటే, కేవలం రెండు లక్షల ఓటర్లు మాత్రమే బయటకు వచ్చి



ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు స్వచ్ఛందంగా బయటకు రాని పరిస్థితుల్లో ఎలక్షన్స్ జరుగుతుండడం మంచి పరిణామం కాదు. తెలంగాణలో వర్గ విభేదాలతో బిజెపి ఎప్పటికీ అధికారంలోకి రాలేదు. ఇప్పటికీ సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకుపోలేక, వర్గ విభేదాలతో కాంగ్రెస్ వచ్చే 2029 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. బి ఆర్ ఎస్ కుటుంబ తగాదాలతో, అవినీతితో కొట్టుమిట్టాడుతుంది. కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత బయటకు వచ్చి కుటుంబ సభ్యులతో పాటు, బిఆర్ఎస్ అవినీతిపై పోరాటం చేస్తుండడంతో తెలంగాణలో టిఆర్ఎస్ (డి) ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుతూ, తెలంగాణలో అధికారంలోకి వస్తుందని రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మరి బాలరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు పూణేమ్ సీతక్క, పాల్వంచ మండల అధ్యక్షులు వర్షా కృష్ణ, రావుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అందుకే.. సమంత పక్కన కూర్చోవాలంటే సిగ్గేసింది: శోభారాజు

సమంత - రాజ్ నిడిమోరు వివాహానికి అతి కొద్దిమంది మాత్రమే హాజరైన సంగతి తెలిసిందే. ఈ వేడుకకు సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలను సమంత స్నేహితురాలు, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి ఇప్పటికే పంచుకున్నారు. తాజాగా.. శోభారాజు పెళ్లి విషయాలతోపాటు మరికొన్ని సంగతులు చెప్పారు. అన్నమయ్య సంకీర్తనలు పాడటం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. రాజ్‌కు పిన్ని. పెళ్లికి ముందు నాటి సంభాషణలు గుర్తుచేసుకుంటూ.. సన్నగా ఉన్న సమంత పక్కన కూర్చోవాలంటే సిగ్గేసిందంటూ సరదాగా వ్యాఖ్యానించారు. బరువు తగ్గేందుకు సమంత చెప్పిన సలహాలు, సూచనలు ఫాలో కావాలంటే భయమేసిందన్నారు.



"ఆహారం విషయంలో సమంత క్రమశిక్షణతో ఉంటుందని, మూడు నెలలకోసారి ఈశా యోగా కేంద్రానికి వెళ్లి ధ్యానం చేస్తుంటుందని ఓ సందర్భంలో విన్నా. తర్వాత అది నిజమని తెలిసింది. ఆధ్యాత్మిక చింతన కలిగిన అమ్మాయి.. రాజ్ జీవితంలోకి రావడం సంతోషంగా ఉంది. రాజ్ కూడా ఆహారం, వ్యాయామం, ధ్యానం.. ఇలా అన్నింటిలో క్రమశిక్షణతో ఉంటాడు. రాజ్.. మా అక్క కుమారుడు. బాల్యంలో డివోషనల్ సాంగ్స్ పాడేవాడు. రాజ్‌పై నాకు ప్రేమ ఎక్కువ. వీరి వివాహ పద్ధతిలో 'క్లేశ నాశన' ఓ భాగం. సాత్వికాహారం పెట్టారు. సహజ సిద్ధమైన పర్‌ఫ్యూమ్స్‌ని గిఫ్ట్‌గా ఇచ్చారు. పెళ్లి దుస్తుల్లో సమంత చాలా బాగుంది" అని పేర్కొన్నారు.

**వెబ్‌సిరీస్ సక్సెస్ పార్టీలో రాజ్**

వివాహానంతరం రాజ్ 'ది ఫ్యామిలీమ్యాన్ 3' వెబ్‌సిరీస్ సక్సెస్ పార్టీకు హాజరయ్యారు. ముంబయిలో నిర్వహించిన ఈ వేడుక ప్రాంగణానికి ఆయన చేరుకోగానే ఫొటోగ్రాఫర్లు పెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌తోపాటు డైరెక్టర్ డీకే, నటుడు మనోజ్ బాజ్‌పాయ్ తదితరులు ఉన్నారు. మరోవైపు, సమంత కూడా వృత్తిపరంగా బిజీగా అయ్యారు. ఈ నెల 1న వివాహం కాగా ఈ నెల 5న 'మా ఇంటి బంగారం' షూటింగ్‌లో పాల్గొన్నారు. నందిని రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని సమంత నిర్మిస్తుండటం విశేషం.

# మనమెప్పుడూ చట్టానికి కట్టుబడి ఉండాలి

: రానా దగ్గుబాటి




మనమెప్పుడూ చట్టానికి కట్టుబడి ఉండాల్సిందేనని నటుడు రానా దగ్గుబాటి అన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ వెళుతుందని పేర్కొన్నారు. ముంబయిలో ఒక ఈవెంట్‌లో ఎదురైన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రొడక్ట్ క్వాలిటీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నాకే దేనికైనా తాను ప్రచారం చేస్తానని మరో ప్రశ్నకు బదులిచ్చారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన ప్రముఖులపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. అందులో రానా కూడా ఉన్నారు. సీఐడీ సిట్ విచారణకు ఆయన నవంబరులో హాజరయ్యారు. చట్టబద్ధమైన యాప్ అని తెలుసుకున్నాకే ప్రచారం చేసినట్లు విచారణ అనంతరం మీడియాకు తెలిపారు. ఈ పరిణామాలనుద్దేశించి ముంబయి ఈవెంట్‌లో ప్రశ్నించగా.. రానా రియాక్ట్ అయ్యారు. నిర్మాతగానూ రానా బిజీగా ఉన్నారు. దుల్కర్ సల్మాన్ హీరోగా ఆయన నిర్మించిన 'కాంత' నవంబరులో విడుదలైంది. అందులో ఓ కీలక పాత్ర కూడా పోషించారు. మరోవైపు, శివ కార్తికేయన్ హీరోగా సుధా కొంగర తెరకెక్కిస్తున్న 'పరాశక్తి'లో కీలక రోల్ ప్లే చేశారు. ఈ మూవీ 2026 సంక్రాంతికి విడుదల కానుంది.

# 'అఖండ 2' వాయిదా.. 'ది రాజాసాబ్'పై రూమర్స్.. స్పందించిన నిర్మాత



బాలకృష్ణ హీరోగా నటించిన 'అఖండ 2' విడుదల చివరి క్షణంలో వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితి తనను బాధించిందంటూ నిర్మాత విశ్వ ప్రసాద్ తాజాగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తాను నిర్మిస్తున్న 'ది రాజాసాబ్' రిలీజ్‌పై వచ్చిన రూమర్స్‌పైనా ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. ''విడుదలకు సిద్ధమైన సినిమాలు కొన్ని గంటల ముందు వాయిదా పడుతుండటం దురదృష్టకరం. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాలి. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు.. ఇలా ఎంతోమందిపై అది ప్రభావం చూపుతుంది. థర్డ్ పార్టీలు చివరి క్షణంలో సినిమా విడుదలకు అంతరాయం కలిగించకుండా చట్టపరమైన మార్గదర్శకాలు రూపొందించడం చాలా ముఖ్యం. 'ది రాజాసాబ్' రిలీజ్‌పై రూమర్స్ వచ్చాయి. ఈ సినిమా కోసం సేకరించిన పెట్టుబడులను మేం క్లియర్ చేశాం. వడ్డీని కూడా త్వరలోనే చెల్లిస్తాం. 'అఖండ 2'తోపాటు డిసెంబరులో విడుదల కానున్న చిత్రాలు, 2026 సంక్రాంతికి రానున్న 'ది రాజాసాబ్', 'మన శంకర వరప్రసాద్ గారు', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'అనగనగా ఒక రాజు', 'నారీ నారీ నడుమ మురారి', 'జన నాయగన్', 'పరాశక్తి' తదితర సినిమాల కోసం ఎదురుచూస్తున్నా. అన్నీ విజయాలు అందుకోవాలని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు. ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న చిత్రమే 'ది రాజాసాబ్'. ఈ మూవీ జనవరి 9న విడుదల కానుంది. బాలకృష్ణ హీరోగా బోయపాటి తెరకెక్కించిన 'అఖండ 2' ఈ నెల 5న విడుదల కావాల్సి ఉండగా.. ఆర్థిక పరమైన సమస్యల కారణంగా వాయిదా పడింది. ఈ సినిమాని 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట గోపి ఆచంట నిర్మించారు. త్వరలోనే మరో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.



ఈ అందమైన డ్రెస్ లో కృతి సనన్ మీ మనసు దోచుకుంటుంది కృతి సనన్ తన కొత్త ఫోటోను షేర్ చేసింది మరియు ఆ ఫోటో త్వరగా అందరి దృష్టిని ఆకర్షించింది.

## సినిమా

# మర్చిపోలేకపోతున్న

ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్లు అవుతున్నా.. ఇంకా స్టార్ హీరోయిన్ గానే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది నయనతార. తెలుగు, తమిళ చిత్రాలతో పాటు బాలీవుడ్‌లోనూ మంచి పాపులారిటీ సంపాదించుకుంది. కానీ తన సినీ కెరియర్‌లో కొన్ని పొరపాట్లు చేసినట్లు, వాటిని సవరించుకున్నట్లు తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఒక సినిమా షూటింగ్‌లో మోహన్‌లాల్‌తో నటించినప్పుడు చాలా డైలాగులు, వాటికి తగ్గట్టుగా హావభావాలు పలికించేందుకు చాలా కష్టపడ్డట్టు చెప్పింది. తన పరిస్థితి అర్థం చేసుకున్న డైరెక్టర్ మరుసటి రోటు చేద్దామని చెప్పడంతో ఇంటికి వెళ్లి రాత్రంతా రిహార్సల్స్‌చేసిందట. ఇక మరుసటి రోజు అనుకున్నట్లుగానే షూటింగ్ సెట్లో నటించడంతో షాట్ బాగా వచ్చి అందరూ మెచ్చుకున్నారట. అప్పుడప్పుడు సినిమాలలో పొరపాట్లు జరుగుతూనే ఉంటాయని చెప్పిన నటి.. ఆ విషయాలను తాను మర్చిపోలేక పోతున్నట్లు తెలిపింది. ఇక వ్యక్తిగత విషయాల గురించి చెబుతూ తాను, తన భర్త విఘ్నేశ్ ఇద్దరూ ఎంత పని ఉన్నా సరే కలిసే భోజనం చేస్తామని చెప్పింది. తనకు మొదటి ముద్ద పెట్టనిదే ఆయన తినరట. ఎప్పుడైనా గొడవ పడినా, అలిగినా కూడా అలవాటు మానుకోలేదట.

# కాంబో రిపీట్



రోజా', 'బొంబాయి', 'దళపతి', 'గురు', 'గీతాంజలి' వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన దర్శకుడు మణిరత్నం. తాజాగా 'పొన్నియన్ సెల్వన్' ఫ్రాంచైజీతో గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇచ్చిన ఆయన భారీ స్థాయి విజువల్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆ తర్వాత వచ్చిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆశించిన స్థాయిలో సక్సెస్‌సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రేమ కథగా తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారని కోలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. ఇందులో విజయ్ సేతుపతి, సాయిపల్లవి ప్రధాన పాత్రలు పోషించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఇద్దరూ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. ఈ సినిమాను వచ్చే జనవరిలో అధికారికంగా ప్రకటించి, ఏప్రిల్ నుంచి షూటింగ్ ప్రారంభించాలని మణిరత్నం భావిస్తున్నారట. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్‌కు మొదట శింబును కథానాయకుడిగా తీసుకోవాలని ప్లాన్ చేశారని వార్తలొచ్చాయి. అనివార్య కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్‌లో శింబు భాగం కాలేకపోయారట. ఆ తర్వాత కథకు అనుగుణంగా విజయ్ సేతుపతిని ఎంపిక చేసినట్లు సమాచారం. విజయ్ సేతుపతి, మణిరత్నం కాంబినేషన్ గతంలో వచ్చిన 'నవాబ్' సినిమా ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు రెండోసారి ఈ ఇద్దరి కలయిక రిపీట్ కాబోతుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి.



# రెడ్‌శారీలో..

16ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీలో అడుగు పెట్టిన బాలీవుడ్ బ్యూటీ షామా సికిందర్ కెరీర్‌లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంది. సుదీర్ఘ కెరీర్‌లో చేసిన సినిమాలు తక్కువే అయినా బాలీవుడ్‌లో మంచి పేరు సొంతం చేసుకుంది. పాత్రకు ప్రాధాన్యత ఇస్తూ సినిమాలను ఆచితూచి ఎంపిక చేసుకుంటుంది. గ్లామర్ పాత్రలకు, కథలో ప్రాధాన్యత లేని పాత్రలకు నో చుబుతుందట. ముందుగా బాలీవుడ్‌లో అడుగు పెట్టినప్పటికీ ఆఫర్ల విషయంలో అసంతృప్తి కారణంగా బుల్లితెరపై అడుగు పెట్టింది. అందుకే ఈ అమ్మడు బుల్లితెర స్టార్‌గా నిలిచింది. ఆఫర్ల విషయంలో అసంతృప్తి కారణంగా సౌత్ ప్రేక్షకులకు పెద్దగా తెలియక పోవచ్చు కానీ నార్త్ ఇండియన్ ప్రేక్షకులకు ఈమె గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ఇక ఇన్‌స్టాగ్రామ్‌లో మూడు మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ భామ ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ప్రస్తుతం రెడ్‌శారీలో తన అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఇక్కడి సినీ ప్రేక్షకుల్లోనూ గుర్తింపు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తోంది. వాటిని చూసిన నెటిజన్స్ చూపు తిప్పుకోనివ్వడం లేదంటూ కామెంట్స్ పెడుతున్నారు.

# ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ గిన్నిస్ రికార్డ్ వైపు అడుగులు

అభివృద్ధి పథంలో హైదరాబాద్ తోపాటు తెలంగాణ అన్ని రంగాలలో ముందుకు దూసుకుపోతుంది. ఆ వేగం మరింత పెంచడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి పెద్ద పెద్ద కంపెనీలను హైదరాబాద్ ఫ్యూచర్ సిటీకి ఆహ్వానించడానికి తెలంగాణ సర్కార్ నిర్వహించబోతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్శిస్తుంది. తెలంగాణ వైపు ప్రపంచ చూపు అనే విధంగా ప్రపంచదృష్టిని ఆకర్షించే విధంగా తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ ను నాగార్జునసాగర్,హైదరాబాద్ నుండి శ్రీశైలం మధ్య రానున్న కొత్త నగరంలో ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా సమ్మిట్ కు భారీ ఏర్పాట్లు చేస్తూ "రండి... భాగస్వాములు కండి "....అంటూ ఆహ్వానిస్తూ అక్షరాల సమాహారాన్ని ఆకాశంలో ఆవిష్కరించి 3 వేల డ్రోన్లతో గిన్నిస్ బుక్ రికార్డు నెలకొల్పాలని చూస్తుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు ఏ నిర్ణయం తీసుకున్న అది సంచలనమే అని చెప్పాలి. అందులో భాగంగానే డిసెంబర్ 8,9 తేదీలలో గ్లోబల్ సమ్మిట్ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా నిర్వహిస్తుంది. ఇప్పటివరకు ఏం చేసారో వివరించడంతోపాటు భవిష్యత్తులో ఏం చేయబోతున్నారో సదస్సులో క్లారిటీ ఇవ్వడం జరుగుతుంది. ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో భవిష్యత్తులో రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడానికి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసుకోవడానికి తెలంగాణ రైజింగ్




2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన జరిగింది . తెలంగాణను ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి విజన్తో పాటు దాన్ని అమలు చేసే వ్యూహంతో ముందుకు వెళ్తుంది. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే స్పష్టమైన పాలసీ ఉండాలి. ప్రపంచ స్థాయి పేరెన్నికగన్న దిగ్గజాలు, పారిశ్రామిక వేత్తలు, ఐఎస్బీ, నీతి ఆయోగ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలను భాగస్వామ్యం చేసి, ప్రతి అంశాన్ని లోతుగా క్షుణ్ణంగా విశ్లేషించి డాక్యుమెంట్ లో భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని సాధిస్తూ బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి తెలంగాణను మూడు విభాగాలుగా విభజించి స్పష్టమైన ప్రణాళికలను రూపొందించారు. ముఖ్యంగా విజన్, స్ట్రాటజీ తోపాటు ప్యూర్, క్యూర్, రేర్.. ఈ మూడు రకాల వ్యవస్థలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి, తద్వారా తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చడానికి తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ను తీసుకొస్తున్నారు. ఒక్కో రీజియన్లో ప్రాంతాల వారిగా ఏం చేయబోతున్నామన్నది డాక్యుమెంట్ లో చాలా స్పష్టంగా చెబుతున్నారు. రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పం. దార్శనికతే మా భవిష్యత్తు ప్రణాళికలు. తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే క్రమంలో ముందుకు వెళ్లడానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ మరియు పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతో పాటు దేశ విదేశాలకు చెందిన ప్రముఖులందరినీ ఈ సదస్సుకు ఆహ్వానిస్తున్నారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చాలని భావిస్తుంది. వ్యూహాత్మకంగా ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ పెడుతున్న సర్కార్ భవిష్యత్ నగరాన్ని కూడా పెట్టుబడిదారులకు పరిచయం చేయాలని అనుకుంటుంది. తద్వారా హైదరాబాద్ నగర విస్తరణకున్న అవకాశాలను కండ్లకు కట్టాలన్న ఆలోచనతో ఉంది. హైదరాబాద్ అనుకూలతలను గుర్తించి ఇతర నగరాలలో ఉన్న పెట్టుబడులు కూడా ఇక్కడికి తరలివస్తున్నాయి. హైదరాబాదును చాలామంది పెట్టుబడిదారులకు రవాణా సౌకర్యాలు, జీవన పరిస్థితులు, సామాజిక స్థితిగతులు, మానవ వనరులు ఇలా ఏ అంశం చూసుకున్నా హైదరాబాద్ ది బెస్ట్ నగరంగా అనుకుంటున్నారు. హైదరాబాద్ విస్తరణపై దృష్టిపెట్టిన సర్కార్ ఫ్యూచర్ సిటీ రూపకల్పన చేస్తుంది. ఫ్యూచర్ సిటీ నిర్మాణం పూర్తి అయితే దశాబ్దం తర్వాత హైదరాబాద్ అమెరికాలోని న్యూయార్క్ సిటీతో పోటీ పడుతుందన్న ఆశాభావం వ్యక్తం అవుతుంది. వ్యవసాయం, ఐటీ, విద్య, ఆరోగ్యం, మరియు మౌలిక సదుపాయాల రంగాలలో ప్రభుత్వం తీసుకురాబోయే లక్ష్యాలను ఈ సదస్సులో వివరించబోతుంది. ఆర్థికవృద్ధి, అన్నిరంగాల ప్రగతి, సంక్షేమం, సాధికారత, ఇలా భవిష్యత్తు తెలంగాణకు రోడ్డు మ్యాప్ రూపొందించనుంది. హైదరాబాదులో ఇప్పటికే ఐటీ అగ్రగామిగా ఉంది స్టార్ట్ ప్ హాబ్ గా నగరం పెరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల కల్పన, పరిశ్రమల స్థాపన తద్వారా అభివృద్ధి రేటు సాధించడం సంపద సృష్టించడాన్ని ఛాలెంజ్ గా తీసుకుంటుంది. ఈ విషయంలో దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే తెలంగాణకు అనుకూలతలు ఎక్కువ. కావలసినంత భూమి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇప్పటికే అభివృద్ధి అయింది. కావలసినంత మ్యాన్ పవర్ ఉంది. రేవంత్ సర్కార్ సరైన సమయంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తుందని చెప్పుకోవాలి. వాస్తవానికి నేడు దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరంగా హైదరాబాద్ ని చెప్పుకోవాలి. అందులో ముఖ్యంగా ఐటీ, ఫార్మా ,రియల్ ఎస్టేట్, టూరిజం, హాస్పిటల్స్ మౌలిక వసతులు వుండటంతో కంపెనీలు, మెగా పెట్టుబడిదారులు మొత్తం ఈరోజు హైదరాబాద్ వైపు చూస్తున్నారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టడానికి సినిమారంగం ముందుకు వస్తుంది. సిని హీరోలు ఇందులో ఫిల్మ్ సిటీ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ కు మంచి వాతావరణంతో పాటు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమైన వాతావరణం ఉందని చెప్పాలి. ఇప్పటికే ఐటీ ఫార్మా ఇతర రంగాలలో బహుళాజాతి సంస్థలు హైదరాబాదులో తమ కార్యకలాపాలు ఎప్పటినుండో నిర్వహిస్తున్నాయి. వీటితోపాటు తెలంగాణ సర్కార్ నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులను ఫెట్టడానికి సదస్సులో పాల్గొనడానికి దేశ విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు ఉత్సాహం చూపుతున్నారు. దాదాపు లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని సర్కార్ భావిస్తుంది. పాలనా విధానాలలో స్పష్టత, అభివృద్ధి ప్రణాళికలలో వేగం, భవిష్యత్తు విషయంలో ఆశావాహదృక్పథంతో తెలంగాణ పరుగులు తీస్తున్నదని చెప్పడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్ పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు పోతున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సదస్సుకు దాదాపు మూడు వేల మంది హాజరవుతారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తుంది.



ముచ్చర్ల దినకర్ రచయిత, తెలంగాణ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు
9440704535



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోగల అల్మాస్ గూడలో స్టూడియో స్టైల్ ఫోటోగ్రఫీ స్టూడియోను ప్రారంభించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు దిండు శ్రీనివాస్ గౌడ్, ముకుంద రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్, డిసెంబర్ 07 (భారత శక్తి ):

## మాతృమూర్తి పేరుమీద బాషామియా సేవలు అభినందనీయం

* **జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్**

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 7: మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ బాషామియా తన మాతృమూర్తి షేక్ ఖాజాభి పేరున వైద్య సేవలు చేయించడం అభినందనీయమని జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరి నగర్ 6వ వార్డు ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాషామియా మొదటినుంచి కులామతాలకతీతంగా అనేక రకాల సేవ కార్యక్రమాలు చేపట్టారన్నారు. బి ఆర్ ఎస్ హయాంలో తెలంగాణ జాతిపిత కెసిఆర్ నేతృత్వంలో మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి నాయకత్వంలో సూర్యాపేట ప్రజలందరికీ కంటి వెలుగు తో పాటు అనేక రకాల అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. అందుకే తమ వార్డుతోపాటు పరిసర ప్రాంతాల



ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించి భాషామియా ఇటువంటి కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేడు 200 మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించుకున్నారన్నారు. అందులో అవసరమైన వారికి కంటి అద్దాలు, ఆపరేషన్లు సైతం తానే స్వయంగా నిర్వహించనున్నట్లు బాషామియా తెలిపారు. కంటి పరీక్షల కోసం ప్రైవేటు దావఖానాకు వెళితే 10 నుంచి 15 వేల రూపాయలు వరకు ఖర్చు అవుతుందని.. ఇటువంటి సమయంలో తమకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయా వార్డుల ప్రజలు ఈ సందర్భంగా భాషామియా కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసాయిగూడెం మాజీ సర్పంచ్ దుబ్బ శ్యామ్, ఆయా వార్డుల నాయకులు దుబ్బ ప్రేమ్ కుమార్, ధరావత్ విజయ చక్రు నాయక్, వెంకటరమణ, ధారావత్ శివరాం, వెంకన్న, జానయ్య, సైదిరెడ్డి, బబ్లు, లక్ష్మణ్, ఉపేంద్ర చారీ, లక్ష్మీ, శ్రీను, తిరుపయ్య, సమ్మయ్య, రోజా గారు నారాయణ, వెంకటరమణ, లయన్స్ క్లబ్ సిబ్బంది బంగారు స్వాతి, వీరేంద్ర చారి పాల్గొన్నారు.



## సూర్యాపేట రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 7 : మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న సూర్యాపేట రూరల్ పరిధి గ్రామాలలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్ ఎన్నికల అధికారులతో కలిసి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాలను సందర్శించడం 2జరిగింది. గ్రామాల్లో ప్రశాంత వాతావరణము ఎన్నికలు జరిగి గ్రామాల ప్రశాంత గ్రామాలుగా పోలీస్ రికార్డ్స్ లో ఉండాలని సిఐ తెలిపారు. ఓటర్లు ముందస్తుగా వారి యొక్క పేర్లు తాజా ఓటర్ జాబితాలో ఉన్నాయో లేవో తనిఖీ చేసుకోవాలని ఎన్నికల రోజున పోలింగ్ బూత్ వద్ద క్యూలైన్లో నిలబడి వారి యొక్క ఓటును సక్రమ పద్ధతిలో సద్వినియోగం చేసుకోవాలని సిఐ తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు నిబంధనలు మేరకు ప్రచారం నిర్వహించుకోవాలని అన్నారు. ప్రచార సమయంలో అభ్యర్థులు ఒకరికొకరు విమర్శలు చేసుకోవద్దని అంతా ఒక ఊరి గ్రామం వారమే అని గుర్తుంచుకోవాలని అన్నారు.

## అర్వపెల్లి ని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చి దిద్దుతా

: **గ్రామ సర్పంచ్ అంబాల ప్రభాకర్ గౌడ్**

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి) డిసెంబర్7: అర్వపల్లిని హసన్ పర్తి మండలంలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చి దిద్దుతానని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ అంబాల ప్రభాకర్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ గుంటూరుపల్లి గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే,మంత్రి సహకారంతో గ్రామాన్ని హాసన్ పర్తి మండలంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీ గా తీర్చిదిద్దుతానన్నారు.గ్రామ ప్రజలకు త్రాగునీరు,వీధి దీపాలు,విద్యుత్,డ్రైనేజీ మొదలగు ఎలాంటి సమస్యలున్నా ముందుండి పరిష్కారం చేస్తానని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక గండం

* **బ్లాక్ లో 7,000 కు 8000 కు ట్రాక్టర్ ఇసుక యతెచ్చక దొరుకుతుంది**
* **కానీ ఆన్లైన్లో బుక్ చేసుకున్న వారికి నెలరోజులైనా ఇసుక సరఫరా కావట్లేదు**
* **తెలిసి కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు?**
* **ఇసుక కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు**

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 7: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక గండం పట్టుకుంది. ఇసుక కోసం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ ప్రతినిధులు ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం చేసుకోవాలని ప్రకటనలు చేస్తున్నారు. ఇసుక సమస్య ఉందని వీరికి తెలియదా ? అని లబ్ధిదారులు సందిగ్ధం లో పడ్డారు.



బ్లాక్ లో 7000, 8000 ట్రాక్టర్ ఇసుక అడ్డు అదుపు లేకుండా అమ్ముడు పోతుంటే సంబంధిత అధికారులు మాత్రం ఆన్లైన్లో బుక్ చేసుకోమని ఆదేశాలు జారీ చేసి బుక్ చేసుకున్న వారికి 20 రోజులు దాటిన ఇసుక పంపించని పరిస్థితి. లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరికి బేస్మెంట్ లెవల్లో నిర్మాణం ఆగిపోతే మరికొందరికి స్లాప్లేవల్లో పిల్లర్లు ఏర్పడిన తర్వాత అదేవిధంగా గోడలకు స్లాబ్ వరకు ఇలా రకరకాలుగా నిర్మాణాలు ఇసుక లేక ఆగిపోతున్నాయి. ఈ విషయం తెలిసి కూడా అధికారులు ఎందుకు స్పందించట్లేదోనని లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. ఇది ఇలా ఉంటే ఎన్నికల నిర్వహణ వ్యవహారంలో అన్ని శాఖల అధికారులు నిమగ్నమయ్యారని ఈ కారణం చేత ఇసుక రవాణా గురించి పట్టించుకోవట్లేదన్న అనుమానాలు పలువురులో వ్యక్తమవుతున్నాయి. ఇంతే కాకుండా కొందరికి బిల్లులు పడే విషయంలో కూడా ఆలస్యం అవుతుందని లబ్ధిదారులు అంటున్నారు. కొందరికి వెంటనే బిల్లులు పడుతున్నప్పటికీ ఇంకొందరికి ఆలస్యం కావడానికి గల కారణాలు పూర్తిగా తెలవకపోవడంతో లబ్ధిదారులు కంగారు పడుతున్నారు. కొన్ని కొన్ని టెక్నికల్ సమస్యలు తలెత్తి లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ సమస్యల పై జిల్లా యంత్రాంగం వెంటనే దృష్టి సారించి పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# హైదరాబాదులో అమెరికా కాన్సులేట్ రోడ్డుకు డొనాల్డ్ ట్రంప్ పేరు

తెలంగాణను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే వ్యూహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనలు చేసింది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి వెళ్లే రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ఆదివారం నిర్ణయించింది. ఈ రహదారిని ఇకపై 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా పిలవనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదన గురించి కేంద్ర విదేశాంగ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి త్వరలోనే లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నిర్ణయంతో పాటు మరికొన్ని కీలక రహదారులకు కూడా ప్రముఖుల, సంస్థల పేర్లను ఖరారు చేశారు. రావిర్యాల వద్ద నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డును, ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డును కలిపే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టనున్నారు. ఇప్పటికే రవిర్యాల వద్ద ఉన్న ఇంటర్‌ఛేంజ్‌కు 'టాటా ఇంటర్‌ఛేంజ్' అని పేరు ఉన్న విషయం తెలిసిందే. అదేవిధంగా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో గూగుల్ నిర్మిస్తున్న భారీ క్యాంపస్ సమీపంలోని రహదారికి 'గూగుల్ స్ట్రీట్' అని నామకరణం చేయనున్నారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ముఖ్యమైన రోడ్లకు ప్రపంచస్థాయి కార్పొరేషన్ల పేర్లు పెడతామని ప్రకటించారు. దానికి అనుగుణంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తులో 'మైక్రోసాఫ్ట్ రోడ్', 'విప్రో జంక్షన్' వంటి పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం నుంచి హైదరాబాద్ సమీపంలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ముందు ఈ ప్రకటనలు వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44 దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.

### రాష్ట్రవ్యాప్త సంబరాలకు

## పిలుపునిచ్చిన కేటీఆర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెలువడిన చారిత్రక దినమైన డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా 'విజయ్ దివస్' వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఫలించిన రోజును పండుగలా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నాయకులతో సమావేశమైన కేటీఆర్, ప్రతి నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ స్థాయిలో సంబరాలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో డిసెంబర్ 9 ఒక మైలురాయి అని, ఆ రోజును ప్రజలందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ 2009 నవంబర్ 29న నిరాహార దీక్ష ప్రారంభించగా, తీవ్రమైన ఉద్యమ ఒత్తిడి నేపథ్యంలో 10 రోజుల తర్వాత డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని స్మరించుకుంటూ వేడుకలు జరపాలని కేటీఆర్ తెలిపారు. "తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం చేసిన పోరాట ఫలితాలు మనకు గర్వకారణం. దీక్ష ద్వారా సాధించిన విజయాన్ని జరుపుకుందాం" అని ఆయన అన్నారు. ఈ వేడుకల నిర్వహణ కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తోంది. పార్టీ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

### నిన్నటి వరకు ఒక లెక్క...

## రేపటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క

సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ప్రతిష్ఠాత్మక 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగే ఈ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు తరలివస్తుండటంతో నగరం ఆధునిక హంగులను సంతరించుకుంది. ఈ కీలక తరుణంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు హృదయపూర్వక సందేశాన్ని అందించారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరిస్తూ, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. "జాతి కోసం... జనహితం కోసం... గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలి... గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలి" అంటూ తన సందేశాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, గత రెండేళ్లుగా అహర్నిశలు శ్రమించి తెలంగాణను ప్రగతి శిఖరాలపై నిలబెట్టేందుకు తపించానని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమైన వ్యవస్థలను సరిదిద్ది, నిరుద్యోగ యువతకు కొలువుల జాతరతో కొత్త భరోసా కల్పించామని తెలిపారు. రుణభారంతో కుంగిపోయిన రైతులకు అండగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థికంగా చేయూతనివ్వడంతో పాటు, కేవలం కొద్దిమందికే పరిమితమైన వ్యాపార రంగాన్ని బలోపేతం చేశామని వివరించారు. సామాజిక న్యాయం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, బలహీన వర్గాల వందేళ్ల ఆకాంక్ష అయిన కులగణన చేపట్టామని, మాదిగ సోదరుల దశాబ్దాల ఉద్యమానికి ఎస్సీ వర్గీకరణ ద్వారా న్యాయం చేశామని తెలిపారు. విద్యను బతుకుదెరువుకు బ్రహ్మాస్త్రంగా భావించి, 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల' నిర్మాణానికి పునాదులు వేశామని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం అనే మూల సిద్ధాంతాలతో ముందుకు సాగుతూ, ప్రజాకవి అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతానికి రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తింపునిచ్చామని చెప్పారు. ఈ రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నధాన్యాలకు రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చే పథకాలు తమ పాలనకు నిదర్శనాలని అన్నారు. కేవలం నేటి అవసరాలు తీర్చడమే కాకుండా, 2047 నాటికి స్వతంత్ర భారతావని వందేళ్ల మైలురాయికి చేరేనాటికి తెలంగాణ ఎలా ఉండాలనే దానిపై లోతైన అధ్యయనంతో ఒక మార్గదర్శక పత్రాన్ని సిద్ధం చేశామని వెల్లడించారు. "గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు ప్రాణం పోసి, #TelanganaRising ప్రణాళికలతో ప్రపంచ వేదికపై రీసౌండ్ చేయడానికి సిద్ధమయ్యాం. నిన్నటి వరకు ఒక లెక్క... రేపటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క" అని సీఎం తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలు ఇచ్చిన ఓటు, వారి ఆశీర్వాదాలే తనకు ధైర్యాన్ని, సంకల్పాన్ని ఇచ్చాయని, వారి ప్రేమాభిమానాలే తనకు సర్వస్వమని తెలిపారు. "తెలంగాణ నాకు తోడుగా ఉన్నంత వరకు... ఈ గొంతులో ఊపిరి ఉన్నంత వరకు... 'TELANGANA RISING'కు తిరుగు లేదు" అని తన సందేశాన్ని ముగించారు.

### గోవా అగ్నిప్రమాదంపై

## రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ విచారం

గోవాలోని ఓ ప్రముఖ నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా ప్రాంతంలో ఉన్న బిర్చ్ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మృతుల్లో 16 మంది క్లబ్ సిబ్బంది, ముగ్గురు మహిళలు, నలుగురు పర్యాటకులు ఉన్నారు. కొందరు మంటల్లో చిక్కుకుని మరణించగా, ఎక్కువ మంది దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇది చాలా బాధాకరమైన సంఘటన అని అన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### కేసీఆర్ పోయి రేవంత్ వచ్చారంతే...

## అందులో మాత్రం మార్పేమీ లేదు: కిషన్ రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని, ఈ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ 'రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన' పేరుతో ఆదివారం మహా ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలపై ఒక చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని ఎలా దోచుకుందో చూశామని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ అదే జరుగుతోందని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల రాష్ట్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం చేశారని 'ప్రజా పాలన' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. "కేసీఆర్ పోయి రేవంత్ రెడ్డి వచ్చారంతే.. పాలనలో, దోపిడీలో ఎలాంటి మార్పు లేదు" అని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదని సీఎంను నిలదీశారు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ వంటి హామీల గతి ఏమైందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బెల్ట్ షాపులను రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు మద్యం అమ్మకాలతో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. ఈ రెండేళ్లలో ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే, తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ ధర్నాలో బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నమ్మించి మోసం చేశారు...

## సోషల్ మీడియాలో భక్తుడి పోస్ట్

దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత అక్షరధామ్ ఆలయం వద్ద ఓ వ్యక్తి ఘరానా మోసానికి గురయ్యాడు. పూజారి వేషంలో ఉన్న వ్యక్తిని నమ్మి సుమారు రూ.1.8 లక్షల విలువైన వస్తువులను పోగొట్టుకున్నాడు. ఈ మోసం జరిగిన తీరును బాధితుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ రెడ్డిట్‌లో పంచుకుంటూ, ఇతర భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాడు. వివరాల్లోకి వెళితే, బాధితుడు ఒంటరిగా అక్షరధామ్ ఆలయానికి బస్సులో వెళుతుండగా, ఓ వృద్ధుడు పరిచయమయ్యాడు. ఎంతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మాట్లాడుతూ బాధితుడి నమ్మకాన్ని చూరగొన్నాడు. ఆలయంలోని క్లోక్‌రూమ్ సురక్షితం కాదని, గతంలో తాను అక్కడే తన ఫోన్, పర్స్ పోగొట్టుకున్నానని నమ్మబలికాడు. తన వస్తువులను భద్రపరచడానికి తనకు నమ్మకమైన వ్యక్తి ఉన్నాడని చెప్పి, ఫోన్ చేసి పిలిపించాడు. కొద్ది నిమిషాల్లోనే పూజారి దుస్తుల్లో ఉన్న మరో వ్యక్తి అక్కడికి చేరుకున్నాడు. బాధితుడికి తిలకం దిద్ది, మీ వస్తువులు ఇక్కడ భద్రంగా ఉంటాయని భరోసా ఇచ్చాడు. నమ్మకం కలిగించేందుకు, ఆ వృద్ధుడు ముందుగా తన ఫోన్, పర్సును ఆ నకిలీ పూజారికి అప్పగించాడు. ఇది చూసిన బాధితుడు, తనలో ఉన్న అనుమానాన్ని పూర్తిగా పక్కనపెట్టి, తన శాంసంగ్ ఎస్24 అల్ట్రా ఫోన్, స్మార్ట్‌వాచ్, రూ.8,000 నగదు ఉన్న పర్సు, క్రెడిట్, డెబిట్ కార్డులు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి విలువైన వస్తువులన్నీ వారికి ఇచ్చాడు. అనంతరం, ఆ వృద్ధుడితో కలిసి ఆలయంలోకి వెళ్లి ప్రశాంతంగా దర్శనం చేసుకున్నాడు. బయటకు వచ్చాక, ఆ వృద్ధుడు బాధితుడికి ఒక లడ్డూ ఇచ్చి, "కొంత డబ్బు డిపాజిట్ చేసి వస్తాను, ఇక్కడే ఉండు" అని చెప్పి వెళ్లాడు. నిమిషాల వ్యవధిలోనే ఆ వృద్ధుడు, నకిలీ పూజారి ఇద్దరూ మాయమయ్యారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ తరహా వ్యవస్థీకృత మోసాలు ప్రధాన పుణ్యక్షేత్రాల వద్ద సాధారణంగా జరుగుతుంటాయని పోలీసులు తెలిపినట్లు బాధితుడు పేర్కొన్నాడు. మోసగాళ్లు అనుమానాస్పదంగా కాకుండా, ఎంతో నమ్మకంగా, మర్యాదగా ప్రవర్తిస్తారని, ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులను నమ్మి విలువైన వస్తువులను ఇవ్వొద్దని, కేవలం అధికారిక క్లోక్‌రూమ్‌లను మాత్రమే ఉపయోగించాలని అతడు ఇతరులకు సూచించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆ 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మారాలి: చంద్రబాబు హెచ్చరిక

తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలలో మెజారిటీ సభ్యుల పనితీరు మెరుగుపడిందని, అయితే మరో 37 మంది పనితీరు మరింత మెరుగుపడాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో ఉన్న నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమీక్షలు, వన్ టూ వన్ భేటీల ద్వారా చాలామంది పనితీరులో మార్పు వచ్చిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై నాలుగైదు మార్గాల్లో కచ్చితమైన సర్వే నివేదికలను తెప్పించుకుంటున్నట్లు చంద్రబాబు గుర్తుచేశారు. ఈ నివేదికల ఆధారంగానే పనితీరును అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇదే సమావేశంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్ విషయాన్ని కొందరు నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ "నెలకోసారి వచ్చి విజ్ఞత కోల్పోయి మాట్లాడే వారి మాటలకు విలువ లేదు. అర్థం పర్థం లేని మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రజలే వారికి బుద్ధి చెబుతారు" అని వ్యాఖ్యానించారు. అనంతరం పార్టీ క్యాడర్ నిర్మాణంపై మాట్లాడుతూ.. ఎలాంటి పదవులు ఆశించకుండా బీజేపీ కోసం ఆర్ఎస్ఎస్ నిస్వార్థంగా పనిచేస్తోందని, అదే స్ఫూర్తితో టీడీపీ కార్యకర్తలను కూడా సైద్ధాంతికంగా బలోపేతం చేయాలని సూచించారు. అలాగే, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 'స్కూల్ ఇన్నోవేటివ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్' అనే కార్యక్రమాన్ని రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ భాగస్వామ్యంతో చేపడదామని పిలుపునిచ్చారు.

## గోవా నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 25 మంది మృతి

గోవాలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఉత్తర గోవాలోని అర్పోరా గ్రామంలో ఉన్న ఓ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. వంటగదిలో సిలిండర్ పేలడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రాజధాని పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'బర్చ్ బై రోమియో లేన్' అనే నైట్‌క్లబ్‌లో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో నలుగురు పర్యాటకులు ఉండగా, మిగిలిన వారంతా క్లబ్ సిబ్బంది అని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. ముగ్గురు వ్యక్తులు మంటల్లో సజీవదహనం కాగా, 20 మంది పొగకు ఊపిరాడక చనిపోయారని పోలీసులు వెల్లడించారు. ప్రమాద వార్త తెలియగానే ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, స్థానిక ఎమ్మెల్యే మైఖేల్ లోబోతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ దుర్ఘటనపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించినట్లు ప్రకటించారు. క్లబ్‌లో భద్రతా ప్రమాణాలు పాటించలేదని ప్రాథమికంగా తెలిసిందని, విచారణలో నిర్లక్ష్యం బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు ఇచ్చిన అధికారులను కూడా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోని అన్ని నైట్‌క్లబ్‌లలో తనిఖీలు చేపడతామని, అనుమతులు లేని వాటి లైసెన్సులు రద్దు చేస్తామని ఎమ్మెల్యే మైఖేల్ లోబో తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతేడాది ప్రారంభమైన ఈ క్లబ్‌లో ఇంత పెద్ద ప్రమాదం జరగడం స్థానికంగా కలకలం రేపింది.

## స్పీకర్‌కు హరీశ్ రావు ఘాటు లేఖ... ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై ఫైర్

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ఘాటు లేఖ రాశారు. గడిచిన రెండేళ్లుగా శాసనసభలో తీవ్రమైన లోపాలు జరుగుతున్నాయని, ఇది శాసనసభ రాజ్యాంగబద్ధమైన విశ్వసనీయతను దెబ్బతీస్తోందని ఆయన ఆరోపించారు. స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ లేఖను విడుదల చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై హరీశ్ రావు తన లేఖలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 10 మంది ఎమ్మెల్యేలపై తాము పిటిషన్లు దాఖలు చేసినా, వాటిపై నిర్ణయం తీసుకోకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2)ను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర హెచ్చరికలను కూడా ఆయన గుర్తుచేశారు. "ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్" అన్న చందంగా ఎమ్మెల్యేల పదవీకాలం ముగిశాక తీర్పు ఇస్తే ప్రయోజనం ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు.

# వామ్మో ఇదేం స్కూల్... బిడ్డలకు రక్షణ ఏది...?

* చిన్నారుల ప్రాణాలను పణంగా పెట్టి చదువులా...?
* మన్సూరాబాద్ బచ్పన్ స్కూల్ భవనం డేంజర్...!
* నివాస భవనంలో చదువులు ఆ ఇంటిపైనే నివాసాలు...!
* గ్యాస్ లీకేజ్,ఎలక్ట్రికల్ ఐటమ్స్ తో ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటి...?
* నడవడానికి సరిగ్గా మెట్లు లేవు... బయటకు వెళ్ళడానికి పెద్ద గేట్లు లేవు...!
* ముక్కుపచ్చలారని చిన్నారుల ప్రాణాలతో చెలగాటం...!
* ఫిర్యాదు చేసినా పట్టించుకోని జిహెచ్ఎంసి,విద్యాశాఖ అధికారులు...!
* పిల్లల ప్రాణాలు పోయే దాకా పట్టించుకోరా...?




ఎల్బీనగర్, డిసెంబర్ 07 (భారత శక్తి): అదో కార్పోరేట్ ప్రీ ప్రైమరీ స్కూల్ ఆ స్కూల్ లో చదివేదంతా ముక్కు పచ్చలారని చిన్నారులే, స్కూల్ వరకు తీసుకెళ్లి తమ బిడ్డలను వారి పేరెంట్స్ ఎంతో నమ్మకంగా టీచర్స్, సిబ్బంది చేతిలో పెడతారు.అయితే ఇంత నమ్మకంగా పేరెంట్స్ తమ బిడ్డలను అప్పజెప్పుతున్న ఆ స్కూల్ లో మాత్రం ఆ చిన్నారులకు సేఫ్టీ లేదనే విషయాన్ని ఆ పేరెంట్స్ గుర్తించలేకపోతున్నారు. ఇది ఎల్బీనగర్ మన్సూరాబాద్ లోని ఉన్న బచ్పన్ స్కూల్ బిల్డింగ్ తతంగం. సాధారణంగా ప్రైమరీ స్కూల్ సరైన మౌలిక సదుపాయాలతో రూల్స్ ప్రకారం ఉండాలి. గ్రౌండ్ ఫ్లోర్ లో మంచి వెంటిలేషన్ తో పాటు కమర్షియల్ ప్రాంతానికి దూరంగా ఉండాలి, ఫైర్ ఎన్ఓసి, ప్లే గ్రౌండ్ ఉండాలి ఇంకా భవనం నాణ్యత ప్రమాణాలతో అన్ని భవన అనుమతులు (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) ఉండాలి...కానీ ఈ స్కూల్ మాత్రం ఓ నివాస గృహంలో కొనసాగుతుంది. నర్సరీ నుండి 5వ తరగతి వరకు కొనసాగిస్తుండగా సుమారు 300 మంది నుండి 500మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.ఈ స్కూల్ బిల్డింగ్ కు ఎలాంటి రూల్స్ తో పని లేదు. పై అంతస్తులో కొంత మంది నివాసం ఉంటున్నారు. గ్రౌండ్ పోర్షన్ తో పాటు రెండు అంతస్థులలో స్కూల్ నడుస్తుండగా పై అంతస్తులో నివాసం ఉంటున్నారు.ఇరుకు గదులు ఇరుకుగా ఉండే మెట్లు... ఇదిలా ఉంటే ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే 500మంది చిన్నారుల భవిష్యత్ ఏంటనేది ప్రశ్నార్ధకం అయ్యింది. పై అంతస్తులో ఉండే నివాసంలో గ్యాస్ లాంటి ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు ఉంటాయి.అక్కడ ఏమైనా ఫైర్ ఏర్పడితే తీవ్ర ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఎమర్జెన్సీలో చిన్నారులు బయటకు వచ్చే అవకాశం కూడా లేదు. కనీస మౌలిక వసతులు, సరైన అనుమతులు లేని ఈ బిల్డింగ్ ను ఎంచుకున్న బచ్పన్ స్కూల్ యాజమాన్యం ఎలా ఎంచుకుందో తెలియదు కాని ఎంతో నిబద్ధతతో ఉండే ఆ సంస్థ ఇలాంటి బిల్డింగ్ ను ఎంచుకోవడంపై విద్యార్థుల జీవితాలనే పణంగా పెట్టినట్లు కనబడుతుంది.ఈ స్కూల్ కు కనీస ప్లే గ్రౌండ్ ఉండదు ఉంటే ఎక్కడో 100మీటర్ల దూరంలో ఓ చిన్న ప్లాట్ లో ఉంటుంది స్కూల్ నుండి గ్రౌండ్ వరకు చిన్నారులు వెళ్లాలంటే రద్దీగా ఉన్న రోడ్డుపై వాహనాల మధ్య నుండి నడుచుకుంటూ వెళ్లాల్సిందే.ఇలా ప్రతీ క్లాస్ కు ఏదో ఓ టైంలో ఆ గ్రౌండ్ కు వెళ్లాల్సిందే ఇలాంటి కనీస రక్షణ లేని బిల్డింగ్ లో స్కూల్ కు అనుమతులు ఎలా ఇచ్చారో విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉండగా అనుమతులు లేని బిల్డింగ్ లో అక్రమ మార్గంలో స్కూల్ కు అనుమతులు తెచ్చుకొని స్కూల్ నడిపే వరకు జిహెచ్ఎంసి అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారో వారు ఎందుకు చేతులు ముడుచుకొని ఉంటున్నారో అర్ధం కావడం లేదు. ఇదే విషయంపై గత నెల రోజుల క్రితం జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమీషనర్ తో పాటు జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కొంత మంది పేరెంట్స్ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమీషనర్, విద్యా శాఖ ఉన్నతాధికారులు అయినా స్పందించి అభం శుభం తెలియని చిన్నారులు ప్రమాదబారిన పడకముందే చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్తలు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

# డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

* కళ్లెం నవజీవన్ రెడ్డి..!



ఎల్బీనగర్, డిసెంబర్ 07 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్‌లోని మహా గాయత్రీ నగర్ కాలనీలో దాదాపు ₹25 లక్షల రూపాయల వ్యయంతో నూతన సీసీ రోడ్ ప్రారంభోత్సవం మరియు ₹20 లక్షల వ్యయంతో (ఎంపీ నిధులతో) కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూడివిజన్ అభివృద్ధి కార్యక్రమాలకు తన సహాయ-సహకారాలు అందిస్తూ ఎప్పుడూ అండగా నిలుస్తున్న మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ వారు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా హయత్ నగర్ డివిజన్ అభివృద్ధి అనేది మా మొదటి లక్ష్యమని ప్రజలు ఏ సమస్య చెప్పినా వెంటనే స్పందిస్తూ, అవసరమైన పనులను దశల వారీగా పూర్తి పూర్తి చేస్తున్నామని, కాలనీ వారీగా రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నామని వారు తెలిపారు. ఇన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో కూడా ఇప్పుడు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి, డివిజన్‌కు మరిన్ని నిధులు తెచ్చి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మేము కట్టుబడి ఉన్నాం. ప్రజల విశ్వాసం మా బలం...అభివృద్ధితో ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నాం వారు కాలనీవాసులకి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీలో అధ్యక్షులు దేవి సింగ్, ప్రధాన కార్యదర్శి మాలిగ లింగం కురుమ, కోశాధికారి పి. మధు, ఉపాధ్యక్షులు చుక్కా రెడ్డి, భగవంతు గౌడ్, రఘునాథ్ ప్రసాద్, సోమయాచారి, శ్రీనివాస్ యాదవ్, రమేష్, వేణుగోపాల్ రెడ్డి,సుజాత, శ్రీదేవి, ఉమాకాంత్, హరి, రవీందర్, రవి , భద్రం, శంకర్ నరేందర్ రెడ్డి బీజేపీ నాయకులు ఎర్ర శ్రీకాంత్, బాలు నాయక్, ప్రేమ్, అఖిల్, ప్రణవ్,కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..





# ఉప్పల్ స్టేడియంకి డిప్యూటీ సీఎం

* రాచకొండ సీపీతో కలిసి మెస్సి ఫ్రెండ్లీ ఫుట్బాల్ మ్యాచ్ ఏర్పాట్ల పర్యవేక్షణ

హైదరాబాద్, డిసెంబర్ 07 (భారత శక్తి) : ఈనెల 13న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న మెస్సి ఫ్రెండ్లీ ఫుట్బాల్ మ్యాచ్ ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడిషనల్ డీజీ విజయ్ కుమార్, రాచకొండ సిపి సుధీర్ బాబులతో కలిసి పర్యవేక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.ఈ సందర్భంగా స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాచకొండ సిపి సుధీర్ బాబు, పోలీస్ అధికారులు, హెచ్ సీఏ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. మెస్సి మ్యాచ్ కోసం వచ్చి, వెళ్లే మార్గాలు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర విఐపి లు వచ్చి వెళ్లే మార్గాలను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. మొత్తంగా హాజరవుతున్న అభిమానుల సంఖ్య, సులభంగా వచ్చి వెళ్ళేందుకు ఏర్పాటుచేసిన గేట్ల సంఖ్య, పార్కింగ్ ఫుట్బాల్ క్రీడా అభిమానుల కోసం మెట్రో, ఆర్టీసీ వంటి రవాణా సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్న రవాణా సౌకర్యాలను ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఉప్పల్ స్టేడియంకి డిప్యూటీ సీఎం. రాచకొండ సీపీతో కలిసి మెస్సి ఫ్రెండ్లీ ఫుట్బాల్ మ్యాచ్ ఏర్పాట్ల పర్యవేక్షణ. ఈనెల 13న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న మెస్సి ఫ్రెండ్లీ ఫుట్బాల్ మ్యాచ్ ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడిషనల్ డీజీ విజయ్ కుమార్, రాచకొండ సిపి సుధీర్ బాబులతో కలిసి పర్యవేక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు. లియోనల్ మెస్సి ఫుట్బాల్ మ్యాచ్ కు దేశం నలుమూలల నుంచి అభిమానులు వస్తున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రత, సౌకర్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్దేశించిన సమయం కంటే ముందే అభిమానులు స్టేడియంలోకి చేరుకొని వారి వారి సీట్లలో కూర్చోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. క్రీడా అభిమానులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాచకొండ సిపి సుధీర్ బాబు, పోలీస్ అధికారులు, హెచ్ సీఏ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. మెస్సి మ్యాచ్ కోసం వచ్చి, వెళ్లే మార్గాలు, సీఎం, మంత్రులు, ఇతర విఐపిలు వచ్చి వెళ్లే మార్గాలను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. మొత్తంగా హాజరవుతున్న అభిమానుల సంఖ్య, సులభంగా వచ్చి వెళ్ళేందుకు ఏర్పాటు చేసిన గేట్ల సంఖ్య, పార్కింగ్ ఫుట్బాల్ క్రీడా అభిమానుల కోసం మెట్రో, ఆర్టీసీ వంటి రవాణా సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్న రవాణా సౌకర్యాలను ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.



# డిపార్ట్మెంట్ ఆఫ్ కార్డియాలజీ ల్యాబ్ ప్రారంభించిన చిగిరింత పారిజాత రెడ్డి

బడంగ్ పేట్, డిసెంబర్ 07 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోగల చౌహాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిపార్ట్మెంట్ ఆఫ్ కార్డియాలజీ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే కొత్తగా ల్యాబ్ ప్రారంభించి చికిత్స అందజేయాలనుకుంటున్న యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సరైన చికిత్స అందుబాటులో లేక చాలామంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని అటువంటి వారికి ఈ ఆసుపత్రి ఎంతో ఉపయోగకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బండారి మనోహర్, ఎర్ర జైహింద్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో

# 47 మంది నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు

* ఇప్పటిదాకా రాష్ట్ర వ్యాప్తంగా 512 మందిని విజయవంతంగా చూపుని ప్రసాదించిన సురక్ష సేవా సంఘం
* చీకట్లో నుండి వెలుగులోకి
* సికింద్రాబాద్ లోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో శ్రీధనలక్ష్మి ఆప్టికల్స్ వారి సహకారంతో విజయ వంతంగా కొనసాగుతున్న సురక్ష కంటి వెలుగు కార్యక్రమం
* నిరుపేదల పాలిట వరంలా మారిన సురక్ష ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరాలు



అబ్దుల్లాపూర్ మెట్ ,డిసెంబర్ 07 (భారత శక్తి): సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా చూపు లేని వృద్ధులను చేరదీసి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపించడం జరుగుతుంది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి 512 మంది వృద్ధులకు చూపునివ్వడం జరిగింది.. శరీరం లోని ఏ అవయవం పని చేసినా పని చేయకున్నా... కంటి చూపు కోల్పోతే లోకమంతా చీకటే.. దీనికి తో పాటు ఒంటరి వృద్ధుల బాధలు ఊహించుకోలేము... వీటిని దృష్టిలో ఉంచికొని వారికి ఆసరాగా నిలబడాలని సురక్ష సేవా సంఘం తెలంగాణ మరియు శ్రీ ధనలక్ష్మి ఆప్టికల్స్ వారు సికింద్రాబాద్ లోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సహకారంతో.. నిరుపేదలకు వెలుగు నివ్వడం జరుగుతుంది..,అబ్దుల్లాపూర్ మెట్టు, పెద్దంబర్పేట పరిసర ప్రాంతాలకి చెందిన వృద్ధులు 17 మంది ఇంకా వరంగల్, జనగాం, సంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ జిల్లాలకు చెందిన 30 మంది వృద్ధులకు విజయవంతంగా కంటి ఆపరేషన్లు చేపించి..క్షేమంగా వారి గృహాలకు తరలించడం జరిగింది. సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపిశంకర్ యాదవ్ ఆదేశాలు మేరకు సంఘ సభ్యులు దగ్గరుండి కంటి ఆపరేషన్లు జరిగిన వృద్ధులకు ఆసరాగా నిలబడటం జరిగింది. ఈ కార్యక్రమంలో,శ్రీ ధన లక్ష్మి ఆప్టికల్స్ ఆప్టో మెట్రిస్ట్ జి.రాజేష్ గౌడ్ ,సురక్ష సభ్యులు ఎస్కే. యాకుబ్ ,సర్కారి నవాను, రఘువీర్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.